

# మనజనప్రగతి

జనం కోసం.. అక్షర ప్రగతి...

తెలుగు దినపత్రిక

సంపుటి : 6 సంచిక : 220 పేజీలు : 8 వెల : రూ.2/- శుక్రవారం 04 సెప్టెంబర్ 2026 వైయస్ఆర్ కడప

Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool


# ప్రజల్లోకి వాస్తవాలు తీసుకెళ్ళండి

- నీళ్లపై గొడ్డలి పార్టీ తప్పుడు ప్రచారం
- స్థానిక సంస్థల ఎన్నికలకు పకడ్బందీగా ముందుకు
- 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరిగేలా చర్యలు
- అన్ని ఎన్నికల్లో కూటమి విజయం సాధించాలి
- అందుకు ఇంచార్జ్ మంత్రులు బాధ్యత తీసుకోవాలి
- సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారించాలి
- ఎల్‌నినో పరిస్థితులపై కేంద్రానికి లేఖ రాస్తాం
- జీఎస్‌డీపీ తగ్గకుండా ప్రభుత్వం ముందస్తు చర్యలు
- పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చూడాలి
- సీడ్ బాల్స్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలి
- మంత్రివర్గ సమావేశంలో సీఎం చంద్రబాబు వెల్లడి
- అజెండా అంశాలు, తాజా పరిణామాలపై సమీక్ష
- సహచర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించిన సీఎం



**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** మంత్రివర్గ సమావేశంలో అజెండా అంశాలు ముగిశాక తాజా పరిణామాలపై సీఎం చంద్రబాబు సహచర మంత్రులతో సుదీర్ఘంగా చర్చించారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఈ సంవత్సరంలోనే పూర్తి చేసి, వచ్చే ఏడాదికి ఎలాంటి ఎన్నికలు మిగలకుండా కోర్టు సమస్యలను పరిష్కరించుకుదామని చంద్రబాబు స్పష్టం చేశారు. 100 మున్సిపాలిటీలతో పాటు కోర్టు పరిధిలో ఉన్న 23 మున్సిపాలిటీల్లోనూ ఎన్నికలు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. అన్ని ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించేలా ఇంఛార్జ్? మంత్రులు బాధ్యత తీసుకోవాలని చంద్రబాబు మిగతా2లో...



## ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

● ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు ● ఇరాన్‌కు సాయం చేసే దేశాలపై ఆంక్షలు విధిస్తాం ● ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా హెచ్చరిక! ● మోదీ, ఇరాన్ అధ్యక్షుడు భేటీ నేపథ్యంలో వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజేష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో మిగతా2లో...

## రాష్ట్రంలో మరింత పటిష్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు

● వన్య ప్రాణుల మరణాలపై సమగ్ర అధ్యయనం ● అటవీ శాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో కమిటీకి బాధ్యతలు



**మంగళగిరి,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** రాష్ట్రంలో వన్యప్రాణుల సంరక్షణను మరింత బలోపేతం చేసే దిశగా సరికొత్త ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యావరణ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేసారు. ఇటీవల చోటు చేసుకున్న వన్యప్రాణుల మరణాల ఘటనలపై సమగ్ర అధ్యయనం నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పులుల మరణాలపై అధ్యయనానికి అటవీశాఖ సలహాదారు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీకి ఆ బాధ్యతలను అప్పగించారు. మిగతా2లో...

## పచ్చదనమే భావి తరాల భద్రతకు పునాది

- పర్యావరణ పరిరక్షణకు 20 ఏళ్ల ప్రణాళికతో ముందుకు సాగాలి
- తాటి చెట్లు, మడ అడవులతో తీర ప్రాంతాల రక్షణ
- పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలి




## పాత ప్రాజెక్టులపై క్రెడిట్ కొట్టే యత్నం

- వైఎస్సార్ హయాంలోనే 79 శాతం పూర్తి
- ప్రజాధనంతో ప్రభుత్వం పబ్లిసిటీ స్టంట్లు
- కూటమి ప్రభుత్వంపై జగన్ విమర్శలు





## ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

- మోటార్‌స్పోర్ట్స్ సిటీ"ని ఏర్పాటు
- చెన్నై నగరం వేదికగా ఒలింపిక్స్
- సీఎం విజయ్ సంచలన ప్రకటన




## వరల్డ్ టూరిజం డే అవార్డులకు పర్యాటక శాఖ దరఖాస్తుల ఆహ్వానం

- మొత్తం 38 విభాగాల్లో 46 పురస్కారాలు
- దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబరు 18 తుది గడువు
- సెప్టెంబరు 27న రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్టత పురస్కారాలు
- 2025-26 ప్రదానం వివరాలు మంత్రి కందుల దుర్గేష్




## నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్ చేశారు: కొండా సురేఖ

**హైదరాబాద్:మన జనప్రగతి సెప్టెంబర్ 03:** తానింకా రాజీ నామా చేయలేదని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఎఐసిసి మల్లిఖార్జున ఖర్గేకు వివరణ ఇచ్చినా..తనను బలి చేయడం బాధాకరమని అన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ..అధిష్టానానికి రాసిన లేఖను విడుదల చేస్తున్నానని, తన వివరణ అడగకుండానే తనను మిగతా2లో...



# ప్రజల్లోకి వాస్తవాలు తీసుకెళ్ళండి

(మొదటి పేజీ తరువాయి)

సూచించారు. అదేవిధంగా జిల్లాల్లో జఠిలమైన సమస్యల పరిష్కారానికి ఇంఛార్జ్? మంత్రులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. పరిష్కారం కాని అంశాలను సంబంధిత శాఖ మంత్రుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని ఆదేశించారు. నరసాపురంలో ప్రజల ఆధీనంలో ఉన్న ఆరు వేల ఎకరాలకు రెండు నెలల్లో పట్టాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి భూములను గుర్తించి అర్హులకు పట్టాలు మంజూరు చేయాలని ఆదేశాలిచ్చారు. రాష్ట్రంలో ఎల్‌నినో పరిస్థితులపై వివరాలతో ఇవాళే కేంద్రానికి లేఖ రాస్తామని చంద్రబాబు తెలిపారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా ఈసారి వర్షపాతం లోటు నమోదైందని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో 76 శాతం, ప్రకాశం జిల్లాలో 70 శాతం లోటు ఉందన్నారు. దేశవ్యాప్తంగా సగటు వర్షపాతం లోటు 14 శాతం ఉంటే ఏపీలో 52 శాతం ఉందని వివరించారు. ప్రతి నెలా క్షేత్రస్థాయి పరిస్థితులను కేంద్రానికి నివేదించాలని ముఖ్యమంత్రి సూచించారు. తాగునీటికి ఎంతైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. అవసరమైన ప్రాంతాలకు తాగునీటిని రవాణా చేసేందుకు అన్ని చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవకాశమున్న చోట నీటి నిల్వలు పెంచాలని, భూగర్భ జలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ అవసరమైతే అదనపు బోర్లకు అనుమతించాలని సూచించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాల్లో జీఎస్డీపీ తగ్గకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశాలిచ్చారు. పశుగ్రాసానికి ఎలాంటి కొరత లేకుండా చూడాలని, సీడ్ బాల్స్ కార్యక్రమానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రతి మంత్రివర్గ సమావేశంలో ఎల్‌నినో ప్రభావం, క్షేత్రస్థాయి పరిస్థితులపై సమీక్షించాలని తెలిపారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు విపత్తు నిర్వహణ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు పొందే అన్ని అవకాశాలను పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులను కేంద్రానికి ఎప్పటికప్పుడు నివేదిస్తూ అవసరమైన సహాయం పొందేందుకు చర్యలు తీసుకోవాలని సూచన చేశారు. లాశయాల్లో నీరు ఉన్నప్పటికీ పంటలకు నీరు ఇవ్వడం లేదంటూ వైఎస్సార్సీపీ చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొట్టి వాస్తవాలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారు. వెలిగొండ, పోలవరం ఎడమ కాలువకు నీటి విడుదలపైనా దుష్ప్రచారం జరుగుతోందని చెప్పారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రతి మంచి పనిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. మంత్రులు, పార్టీ శ్రేణులు నిత్యం ప్రజల్లో ఉంటూ వాస్తవాలను వివరించాలని సూచించారు గ్రౌండ్‌వాటర్ డేటాను అందుబాటులో ఉంచి రైతు సేవా కేంద్రాల ద్వారా అన్నదాతలకు అవసరమైన సమాచారాన్ని అందించాలని చంద్రబాబు ఆదేశించారు. వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించే కార్యక్రమంలో అందరినీ భాగస్వాములను చేయాలని సూచించారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే అవాస్తవాల ప్రభావానికి నేటి తరం లోనుకాకుండా వాస్తవాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వం కూడా చురుగ్గా వ్యవహరించాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెరగకుండా మంత్రులు నాదెండ్ల మనోహర్, పయ్యావుల కేశవ్, అచ్చెన్నాయుడు నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు. రైతు బజార్లలో బియ్యాన్ని తక్కువ ధరకు అందిస్తున్నట్లు నాదెండ్ల మనోహర్ వివరించారు. మిగిలిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు తగిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం సూచించారు. సూర్యఘర్ పథకం వినియోగంలో నాలుగో స్థానంలో ఉన్న ఏపీని మొదటి స్థానానికి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించారు. రాష్ట్రంలో కనీసం 20 లక్షల కనెక్షన్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలను వేగవంతం చేయా లని సూచించారు. ఇలాంటి తప్పులు పునరావృతం కాకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మదనపల్లిలో హార్టికల్చర్ హబ్‌కు ఈ నెల 2 లేదా 3వ వారంలో శంకుస్థాపన చేయనున్నట్లు చంద్రబాబు తెలిపారు. దుగరాజపట్నం వద్ద షిప్ బిల్డింగ్ యూనిట్ ఏర్పాటు కానుందని వెల్లడించారు. రాష్ట్రంలో స్థానిక ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం కల్పించాలని సూచిస్తూ ఆంధ్ర పాప్‌కార్న్, అరకు కాఫీని ప్రతి గ్రామానికి విస్తృతంగా తీసుకెళ్లాలని సీఎం ఆదేశించారు.

# ఇరాన్‌ను అణుశక్తిగా మారకుండా నిరోధిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

# రాష్ట్రంలో మరింత పటిష్టంగా వన్యప్రాణి సంరక్షణ చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

వన్యప్రాణుల ఆవాసాల నిర్వహణ, రక్షణ చర్యలు, మానవ, వన్యప్రాణి ఘర్షణల నివారణ, క్షేత్రస్థాయిలో అమలవుతున్న సంరక్షణ కార్యక్రమాల ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలించి నివేదిక సమర్పించాలని సూచించారు. వన్యప్రాణుల సంరక్షణకు ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ ఆధ్వర్యంలో పటిష్టమైన చర్యలతో పాటు హనుమాన్ వంటి కార్యక్రమాల ద్వారా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి, ప్రత్యేక పరిస్థితుల్లోనూ జంతువుల సంరక్షణ చర్యలు చేపడుతోంది. ప్రస్తుతం అమలులో ఉన్న కార్యక్రమాలు, వాటి ఫలితాలను శాస్త్రీయంగా విశ్లేషించి, అవసరం ఉన్న చోట మరింత పకడ్బందీగా చర్యలు అమలు చేయాలన్న ఉద్దేశంతో పవన్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఉప ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీశాఖ సలహాదారుమల్లిఖార్జునరావు, అదనపు ప్రధాన అటవీ సంరక్షణాధికారి రాహుల్ పాండే నేతృత్వంలోని ప్రత్యేక కమిటీ రాష్ట్రవ్యాప్తంగా వన్యప్రాణుల సంచారం ఉన్న ప్రాంతాలను సందర్శించి, వాటి మరణాలకు దారితీస్తున్న అంశాలు, ఆవాసాల్లో పరిస్థితులు, సంచార మార్గాల్లో అమలు చేస్తున్న భద్రతా ఏర్పాట్లు, వేట నిరోధక చర్యలు, పర్యవేక్షణ వ్యవస్థలు, అటవీ అగ్నిప్రమాదాల నియంత్రణ, నీటి వనరుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తుంది. దీంతో పాటు పులులు, చిరుతలు, ఏనుగులు, ఇతర వన్యప్రాణుల సంరక్షణకు అమలవుతున్న కార్యక్రమాలను సమీక్షించి, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సవాళ్లను గుర్తించి, నివారణ చర్యలపై సూచనలు చేయనుంది. వన్యప్రాణుల ఆవాసాల అభివృద్ధి, సహజ ఆహార వనరుల పెంపు, సంచార మార్గాల సంరక్షణ, స్థానిక ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై ప్రత్యేక నివేదిక రూపొందించి అందజేస్తుంది. దీంతో పాటు మానవ, వన్యప్రాణి ఘర్షణలను తగ్గించేందుకు చేపట్టాల్సిన చర్యలు, విద్యుత్ లైన్లు, రహదారులు, రైల్వే మార్గాలు, ఇతర మౌలిక సదుపాయాల వల్ల ఏర్పడే ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా కమిటీ కీలక సిఫార్సులు చేయనుంది. తిరుపతి సమీపంలో నీటి కోసం వచ్చిన కృష్ణజింక ఇనుప కంచెలో ఇరుక్కుని మృతి చెందిన ఘటనతో చలించిన ఆయన, వేసవిలో జంతువుల దాహార్తిని తీర్చేందుకు వాటి సంచార మార్గాల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సహకారంతో నీటి తొట్టెలు ఏర్పాటు చేశారు.

# పచ్చదనమే భావి తరాల భద్రతకు పునాది

**బాపట్ల,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** వాతావరణ సమతుల్యతను పరిరక్షించడంతో పాటు జీవవైవిధ్యం, జీవరాశుల మనుగడను కాపాడుకోవడానికి విస్తృత స్థాయిలో పచ్చదనాన్ని పెంపొందించడం అత్యంత అవసరమని ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ నాగబాబు పేర్కొన్నారు. మొక్కలు నాటడం కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, భావి తరాల భవిష్యత్తును కాపాడే సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒకటి లేదా రెండు సంవత్సరాల్లో పూర్తయ్యే కార్యక్రమం కాదని, రాబోయే తరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని దీర్ఘకాలిక ప్రణాళికతో, నిరంతర కృషితో ముందుకు సాగాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. గురువారం బాపట్ల జిల్లా సూర్యలంకలో పర్యటించారు. సముద్రపు కోతను అరికట్టడానికి విద్యార్థులతో కలిసి తాటి చెట్లను నాటారు. మీడియాతో మాట్లాడుతూ "గ్రేట్ గ్రీన్ వాల్ వంటి కార్యక్రమాల ద్వారా పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. పర్యావరణం గురించి పుస్తకాల్లో చదవడం, కాగితాలపై అవగాహన పొందడం కంటే పిల్లలు, పెద్దలు స్వయంగా మొక్కలు నాటి, వాటి సంరక్షణలో భాగస్వాములు కావడం ద్వారా ప్రకృతితో మరింత గాఢమైన అనుబంధం ఏర్పడుతుంది. ముఖ్యంగా విద్యార్థులు, యువతతో పాటు సమాజంలోని ప్రతి వర్గాన్ని పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తాం. మొక్క నాటడంతోనే బాధ్యత పూర్తి కాదని, అది ఆరోగ్యంగా ఎదిగి పెద్ద చెట్టుగా మారే వరకు సంరక్షించడం ప్రతి ఒక్కరి బాధ్యత. మొక్కల పెంపకాన్ని కేవలం ఒక కార్యక్రమంగా కాకుండా, భావితరాలకు పచ్చని, సురక్షితమైన భవిష్యత్తును అందించే సామాజిక బాధ్యతగా భావించాలి. ప్రకృతి సంపదను, అరుదైన జీవజాతులను కాపాడుకోవడం కూడా పర్యా వరణ పరిరక్షణలో భాగమే" అన్నారు. అంతకుముందు నాగబాబు బాపట్ల జిల్లా సూర్యల ంకలో విస్తృతంగా పర్యటించారు. విజయవాడ నుంచి బయలుదేరిన ఆయన సూర్యలం కలోని ఏపీఎఫ్డీసీ రిసార్ట్‌ను సందర్శించి, అటవీ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. అనంతరం నగర వనంలో అటవీ శాఖ ఏర్పాటు చేసిన ఆర్ట్ గ్యాలరీ, ఎగ్జిబిషన్‌ను తిలకించారు.

# పాత ప్రాజెక్టులపై క్రెడిట్ కొట్టే యత్నం

**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సాగునీటి ప్రాజెక్టుల విషయంలో ప్రభుత్వం కొత్తగా పనులేమీ చేపట్టకుండా, కేవలం ప్రచార ఆర్భాటాలకే పరిమితమవుతోందని విమర్శించారు.

ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ఆయన స్పందించారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుల ద్వారా నీటిని ఎత్తిపోస్తూ, వాటిని పోలవరం ప్రాజెక్టు జలాలుగా చూపిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రచారం చేసుకుంటున్నారని జగన్ విమర్శించారు.

పురుషోత్తపట్నం పంపులు కానీ, పోలవరం ఎడమ ప్రధాన కాలువ కానీ ప్రస్తుత ప్రభుత్వం నిర్మించినవి కావని ఆయన స్పష్టం చేశారు.

దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలోనే పోలవరం ఎడమ కాలువకు సంబంధించి 79 శాతం పనులు పూర్తయ్యాయని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

క్షేత్రస్థాయిలో కొత్తగా ఎటువంటి పనులు చేపట్టకుండా, గతంలో పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా లబ్ధి పొందాలని ప్రభుత్వం ఆరాటపడుతోందని జగన్ ఆక్షేపించారు. ప్రజాధనంతో ప్రాజెక్టుల వద్ద ప్రచార కార్యక్రమాలు, పబ్లిసిటీ స్టంట్లు నిర్వహించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు.

# ప్రపంచ స్థాయి స్పోర్ట్స్ హబ్‌గా చెన్నై

**చెన్నై:మన జనప్రగతి సెప్టెంబర్ 03:** తమిళనాడు రాజధాని చెన్నైను ప్రపంచ స్పోర్ట్ హబ్‌గా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ అసెంబ్లీ వేదికగా వెల్లడించారు. తమిళనాడు స్పోర్ట్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో ఒలింపిక్ సిటీని అభివృద్ధి చేస్తామని సిఎం ప్రకటించారు. దీని కోసం పటిష్టమైన ప్రణాళికను రూపొందిస్తామన్నారు. అధునాతన సౌకర్యాలతో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసి చెన్నైని ప్రపంచ ఒలింపిక్ నగరంగా అభివృద్ధి చేస్తామన్నారు. అంతేగాక ఫార్ములా వన్ రేసుల కోసం చెన్నై నగరాన్ని సిద్ధం చేస్తామన్నారు. ప్రపంచ స్థాయి మోటార్ స్పోర్ట్ పోటీలు జరిగేలా ట్రాక్‌లను నిర్మిస్తామని తెలిపారు. రానున్న రోజుల్లో చెన్నైని ప్రపంచ క్రీడా నగరంగా మార్చడమే లక్షంగా ముందుకు సాగుతామని సిఎం ప్రకటించారు.

# వరల్డ్ టూరిజం డే అవార్డులకు పర్యాటక శాఖ దరఖాస్తుల ఆహ్వానం

**అమరావతి, మన జనప్రగతి సెప్టెంబర్ 03:** సెప్టెంబర్ 27న అంతర్జాతీయ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వార్షిక పర్యాటక విశిష్టత పురస్కారాలు-2025-26 ప్రదానం చేయనున్నట్లు వెలగపూడి సచివాలయంలో పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అధికారికంగా ప్రకటించారు. ప్రస్తుత డిజిటల్ యుగంలో పర్యాటకుల అనుభవాలను మెరుగుపరచడం, నిర్వహణ సామర్థ్యాన్ని పెంపొందించడం, సాంకేతికతను జోడించడాన్ని ఉద్దేశించి "డిజిటల్ ఎజెండా మరియు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా పర్యాటకరంగ పునర్నిర్మాణం" అనే థీమ్‌తో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎంల దిశానిర్దేశంలో రాష్ట్రంలో పర్యాటక, ఆతిథ్య, ప్రయాణ రంగాలలో అంకితభావంతో సేవనందిస్తున్న భాగస్వాములను ప్రోత్సహించడం, వారిలో ఆరోగ్యకరమైన పోటీతత్వాన్ని,నాణ్యతా ప్రమాణాలను పెంపొందించడం లక్ష్యంగా పురస్కారాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. క్లాసిఫైడ్ హోటళ్లు, రెస్టారెంట్లు, ట్రావెల్ ఏజెంట్లు, టూర్ ఆపరేటర్లు, పర్యాటక ప్రాజెక్టులు, విద్యాసంస్థలు, గైడ్లు, రచయితలు, ఫిల్మ్ మేకర్లు, డిజిటల్ క్రియేటర్లకు ప్రాతినిధ్యం కల్పిస్తూ మొత్తం 38 విభాగాలలో 46 పురస్కారాలను అందించనున్నామన్నారు.ఏప్రిల్ 2025 నుండి మార్చి 2026 మధ్య కాలంలో సాధించిన పురోగతి, పర్యాటకుల రాక, ఆదాయం, సేవా నాణ్యత, పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ, పర్యాటకుల సంతృప్తి ఆధారంగా విజేతలను ఎంపిక చేస్తామన్నారు. 'ఎకో-ఫ్రెండ్లీ హోటల్', 'బెస్ట్ బీచ్' (బ్లూ ఫ్లాగ్ ప్రమాణాలు) విభాగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. అలాగే, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు, డిజిటల్ క్రియేటర్ల సేవలను ప్రత్యేకంగా గుర్తించనున్నట్లు వెల్లడించారు.దరఖాస్తుల సమర్పణకు సెప్టెంబర్ 18న సాయంత్రం 5 గం.ల వరకు తుది గడువు ఉంటుందని,గడువు దాటిన తర్వాత వచ్చే దరఖాస్తులు స్వీకరించబడవు అన్నారు.దరఖాస్తులను నేరుగా లేదా పోస్ట్ ద్వారా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, 5వ అంతస్తు, స్టాలిన్ కార్పొరేట్ బిల్డింగ్, ఆటోనగర్, విజయవాడ చిరునామాకు పంపించాలని వెల్లడించారు. నిర్ణీత నమూనాలో దరఖాస్తు ఫారమ్ నింపడంతో పాటు సాధించిన విజయాలపై 100 పదాలకు మించకుండా చిన్న నివేదిక, కనీసం ఒక హై-రిజల్యూషన్ ఫోటోగ్రాఫ్‌తో కూడిన పత్రాలను పెన్ డ్రైవ్ లో ఇవ్వొచ్చని తెలిపారు..దరఖాస్తు ఫామ్ సహా మరిన్ని వివరాలకు ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ అధికారిక వెబ్‌సైట్ ఝఝఝ.ఖజూశీబతీఅంఎ.స్త్రశీజ.ఱఅను సందర్శించాలని వివరించారు. ప్రాంతీయ సాంస్కృతిక, ఆర్థిక, సామాజిక రంగాలలో పర్యాటక రంగ ప్రాధాన్యతను చాటిచెప్పడానికి, 1970లో ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ నిబంధనలను ఆమోదించిన సందర్భంగా ప్రతి ఏటా సెప్టెంబరు 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు.

# నేనేం తప్పు చేయకున్నా.. నన్ను బర్తరఫ్ చేశారు: కొండా సురేఖ

(మొదటి పేజీ తరువాయి)

బర్తఫ్ చేశారని, ఎఐసిసి ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్ కు కూడా నా బాధంతా చెప్పుకున్నారని తెలియజేశారు. తనకూతురు ఇండిపెండింట్.. తనతో తనకు సంబంధం లేదని.. తన ఫ్యామిలీ తనది అని కొండా సురేఖ పేర్కొన్నారు.

తన బిడ్డ మాట్లాడితే తనను బాధ్యురాలిని చేస్తున్నారని.. తానేం చేయాలి? అని ప్రశ్నించారు. రాజీనామా చేయమని తనను అడగలేదని, తాను చేయలేదని చెప్పారు. రాజకీయాల్లోకి రావాలని తనకు కోరిక ఉందని, భవిష్యత్ కార్యాచరణపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని అన్నారు.

# కేంద్ర యోగా ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి ఉత్తర్వులు

- రూ.100 కోట్లతో 100 పడకలతో సంస్థ ఏర్పాటు
- రూ.9.94 కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ప్రాథమిక పనులు

**త్వరలో ప్రారంభం: మంత్రి సత్యకుమార్ వెల్లడి**




**అమరావతి,మన జనప్రగతి సెప్టెంబర్ 03:** మధుమేహం, రక్తపోటు, ఊబకాయం, దీర్ఘకాలిక నొప్పులు, శ్వాసకోశ, మానసిక ఒత్తిడి, నిద్ర, ఇతర సమస్యలకు యోగా, నేచురోపతి విధానాల్లో చికిత్స గుంటూరు నగర సమీపంలోని ప్రత్తిపాడు మండలం నడింపాలెంలో కేంద్ర యోగా?ప్రకృతి వైద్య పరిశోధన సంస్థ ఏర్పాటు పనులు వేగం పుంజుకున్నాయి. కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ యోగా అండ్ నేచురోపతి ద్వారా 100 పడకల ఆసుపత్రితో ఈ సంస్థను ఏర్పాటు చేయనున్నారు. సంస్థ ఏర్పాటుపై కేంద్రం నుంచి అధికారిక సమాచారం వచ్చినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు ఇందుకు తగ్గట్లు సంస్థ ఏర్పాటుకు అవసరమైన భూమి, రహదారి, డ్రెయినేజీ, స్థల సమతలీకరణ తదితర ప్రాథమిక పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.9.94 కోట్లను మంజూరు చేసినందున తదుపరి పనుల్లో మరింత వేగం పెరుగుతుందని చెప్పారు. **రూ.9.94 కోట్లతో ప్రాథమిక పనులు**మంజూరైన రూ.9.94 కోట్లలో రూ.6.74 కోట్లు భూసంబంధిత అవసరాలకు, రూ.3.20 కోట్లు స్థల నింపుదల, సమతలీకరణకు కేటాయించారు. ప్రాంగణంలోని కొన్ని ప్రాంతాలు ఎన్‌హెచ్?16 స్థాయి కంటే 2?3 మీటర్ల మేర దిగువన ఉండటంతో అవసరమైన మేరకు నాణ్యమైన మట్టితో నింపి నిర్దేశిత స్థాయికి తీసుకురానున్నారు. వర్షపు నీటి సహజ ప్రవాహానికి ఆటనీకనీ లేకుండా చర్యలు తీసుకోనున్నారు. సంస్థకు నేరుగా చేరుకునేలా జాతీయ రహదారి 16 నుంచి ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూమి మీదుగా 40 అడుగుల వెడల్పుతో అప్రోచ్ రోడ్డు నిర్మించనున్నారు. కేంద్రం నుంచి రూ.100 కోట్ల గ్రాంట్‌అఖీఎజఔ ఏర్పాటుకు కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ రూ.100 కోట్ల గ్రాంట్ అందించనుంది. సంస్థకు అవసరమైన భూమిని రాష్ట్ర ప్రభుత్వం సమకూర్చాల్సి ఉండటంతో, ప్రస్తుతం సంస్థ ఏర్పాటు కోసం అవసరమైన ప్రాథమిక పనులను చేపడుతోంది.

# జిల్లాలో కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి అభివృద్ధి చేయాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:**-జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కొత్త పర్యాటక ప్రాంతాలను గుర్తించి, సమగ్ర అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి టూరిజం మంత్రి అధికారిని ఆదేశించారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలో పర్యాటక రంగ పురోగతిపై పర్యాటక కమిటీ సభ్యులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మంత్రాలయం దేవాలయం సమీపంలో హ్యాండ్లూమ్ ఉత్పత్తుల విక్రయ కేంద్రం ఏర్పాటుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని కలెక్టర్ చేనేత అధికారులను ఆదేశించారు.చిన్నతుంబలం చెరువు, నాగలాపురం సుంకులమ్మ, వెంకాయపల్లె ఎల్లమ్మ తదితర ప్రాంతాల్లో పర్యాటక ప్రాధాన్యత కలిగిన ప్రదేశాలను గుర్తించి, అవసరమైన మౌలిక వసతుల కల్పనతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు.అదే విధంగా జగన్నాథ గట్టు,బ్రహ్మగుండం,ఉరుకుంద,కేతవరం తదితర పర్యాటక ప్రాంతాలకు సంబంధించిన లీజు ప్రక్రియను పూర్తి చేసి, తదుపరి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ద్వారా జిల్లాకు వచ్చే సందర్శకుల సంఖ్య పెరగడంతో పాటు స్థానికంగా ఉపాధి, ఆర్థిక అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంటుందన్నారు..జిల్లాలో ఇప్పటికే ఉన్న ప్రముఖ పర్యాటక ప్రాంతాలను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి,సందర్శకులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకురావాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.సమావేశంలో టూరిజం అధికారి తిరుమల నాయుడు, ఇరిగేషన్ శాఖ,డి. వై. ఎస్ ఈ మల్లికార్జున రెడ్డి, డ్వామా ఏపిడి మాధవి లత ,దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుధాకర్ రెడ్డి,సెట్కూర్ సీఈవో వేణుగోపాల్,డివిజనల్ మేనేజర్, ఏపీటీడీసీ లక్ష్మీ నారాయణ, ఈ ఈ,ఏపీటీడీసీ శివ నాగేశ్వర రావు, కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు.పత్తి ఓబులయ్య, టూర్స్ & ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# పరిశ్రమల్లో భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి

● సెప్టెంబర్ నెలాఖరులోపు

**ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్ నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:** జిల్లాలోని పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు అవసరమైన అన్ని భద్రతా చర్యలను కట్టుదిట్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి సంబంధిత అధికారులను,ఆదేశించారు.గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో పరిశ్రమల భద్రత, అత్యవసర పరిస్థితుల నిర్వహణ, మాక్ డ్రిల్స్ నిర్వహణ తదితర అంశాలపై జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు,అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఫ్యాక్టరీ యాజమాన్యాలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అమలు చేస్తున్న భద్రతా ప్రమాణాలను ఫ్యాక్టరీస్ శాఖ అధికారులు క్రమం తప్పకుండా పరిశీలించి ధ్రువీకరించాలని తెలిపారు. జిల్లాలో సెప్టెంబర్ నెలాఖరులోపు ఆఫ్‌సైట్ మాక్ డ్రిల్ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లా క్రైసిస్ కమిటీ సమావేశాలు,మాక్ డ్రిల్స్‌ను క్రమం తప్పకుండా నిర్వహించాలని సూచించారు. ప్రమాదకర పరిశ్రమల నుంచి ఆన్‌సైట్ ఎమర్జెన్సీ ప్లాన్స్‌ను సేకరించినట్లు సమావేశంలో చర్చించారు. ఆయా పరిశ్రమలు తమ అత్యవసర ప్రణాళికలను ఎప్పటికప్పుడు సమీక్షించుకుని,పరిశ్రమల్లో పనిచేసే కార్మికుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రమాదాల నివారణకు అవసరమైన పర్సనల్ ప్రొటెక్టివ్ ఎక్విప్‌మెంట్ (పీ.పీ.ఈ.) కిట్లను కార్మికులకు అందుబాటులో ఉంచాలని,వాటి వినియోగంపై అవగాహన కల్పించాలని సూచించారు.అదేవిధంగా కార్మికులకు భద్రతా ప్రమాణాలు, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన చర్యలపై అవసరమైన శిక్షణను నిరంతరం అందించాలని తెలిపారు.జిల్లాలో పారిశ్రామిక భద్రత,అత్యవసర పరిస్థితుల సమర్థవంతమైన నిర్వహణకు అన్ని సంబంధిత శాఖలు, పరిశ్రమల యాజమాన్యాలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు.ఈ సమావేశంలో కర్నూల్ ఆర్డిఓ సందీప్ కుమార్,డిఎంహెచ్వో డాక్టర్ కామేశ్వర ప్రసాద్,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వరలక్ష్మి,జిల్లా రవాణాశాఖ అధికారి శాంతి,పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారి కిషోర్ రెడ్డి, పబ్లిక్ హెల్త్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గుర్రప్ప యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ చైతన్యలో అలరించిన కృష్ణాష్టమి వేడుకలు



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:**-శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో ముందస్తు శ్రీకృష్ణాష్టమి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాయచోటి పట్టణంలోని కడప రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ చైతన్య ఇంటర్నేషనల్ బోర్డింగ్ స్కూల్ (సీబీఎస్ఈ) ప్రాంగణంలో నిర్వహించిన ఈ వేడుకలు చిన్నారుల సందడితో కళకళలాడాయి.ఈ కార్యక్రమానికి ఉమ్మడి కడప డివిజన్ ఏజీఎం డి. రమణయ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, తల్లిదండ్రులకు ముందస్తు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. ప్రాంతీయ సంచాలకులు పి. మహబూబ్ బాషా కార్యక్రమంలో పాల్గొని విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలను వీక్షించి వారిని అభినందించారు.విద్యార్థులు బాలకృష్ణులు, గోపికల వేషధారణలో ముస్తాబై అలరించారు. తల్లిదండ్రులు తమ చిన్నారులను సంప్రదాయ దుస్తుల్లో ప్రత్యేకంగా అలంకరించి వేడుకలకు తీసుకువచ్చారు. చిన్నారుల వేషధారణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక నృత్యాలు, కృష్ణలీలల ఆధారంగా రూపొందించిన నాటికలు, భక్తి గీతాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ప్రతిభను చూసి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టతను విద్యార్థులకు పరిచయం చేయడంతో పాటు వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కళాభారతి, వైస్ ప్రిన్సిపల్ జీవానందం, పద్మ, ఇంచార్జి నాగప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కృష్ణ తత్వం..యుగయుగాలకు జీవన మార్గం..!

● మన జనప్రగతి ప్రత్యేక కథనం ● కేవలం వేణుగానమే కాదు.. వ్యూహం, విజ్ఞానం, ధర్మం కలగలిసిన మహోన్నత వ్యక్తిత్వం ● భగవద్గీత నుంచి రాజనీతి వరకు.. శ్రీకృష్ణుడి జీవితం నేటి సమాజానికి ఎన్నో పాఠాలు



భారతీయ సంస్కృతిలో శ్రీకృష్ణుడి స్థానం అత్యంత విశిష్టమైనది. ఆయనను కేవలం దేవుడిగా మాత్రమే కాకుండా.. గొప్ప తత్వవేత్తగా, అసాధారణమైన వ్యూహకర్తగా, సమర్థుడైన రాజనీతిజ్ఞుడిగా, ఆదర్శ స్నేహితుడిగా, ధర్మ పరిరక్షకుడిగా భక్తులు కొలుస్తారు. బాల్యంలో గోకులంలో చేసిన చిలిపి లీలల నుంచి కురుక్షేత్ర యుద్ధభూమిలో అర్జునుడికి అందించిన భగవద్గీత బోధన వరకు కృష్ణుడి ప్రతి అడుగులోనూ ఒక సందేశం కనిపిస్తుంది.

### జన్మమే ఓ అద్భుత ఘట్టం

శ్రీకృష్ణుడు శ్రావణ బహుళ అష్టమి నాడు, అర్ధరాత్రి సమయంలో మథురలోని కారాగారంలో దేవకీ, వసుదేవులకు జన్మించాడని పురాణాలు చెబుతున్నాయి. అప్పట్లో మథురను పాలిస్తున్న కంసుడు తన సోదరి దేవకీకి పుట్టే ఎనిమిదో సంతానం వల్ల తనకు ముప్పు ఉందని తెలుసుకుని ఆమెకు పుట్టిన పిల్లలను వరుసగా సంహరించాడు. కృష్ణుడు జన్మించిన సమయంలో కారాగార ద్వారాలు తెరుచుకోవడం, కాపలాదారులు నిద్రలోకి జారుకోవడం వంటి సంఘటనలు చోటుచేసుకున్నాయని పురాణ కథనాలు వివరిస్తాయి. వసుదేవుడు శిశు కృష్ణుడిని యమునా నది దాటి గోకులానికి తీసుకెళ్లి నందుడి ఇంట్లో ఉంచాడని విశ్వాసం. ఈ ఘట్టాన్నే 'వసుదేవుడి అర్ధరాత్రి ప్రయాణం' గా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్మరించుకుంటారు.

### ఎందుకు కృష్ణుడికి ఇన్ని పేర్లు..?

శ్రీకృష్ణుడికి అనేక పేర్లు ఉన్నాయి. ప్రతి పేరు ఆయన వ్యక్తిత్వంలోని ఒక ప్రత్యేకతను తెలియజేస్తుంది. గోపాలకుడిగా ఉన్నందుకు గోపాలుడు, గోవులను రక్షించినందుకు గోవిందుడు, నీలిమేఘం వంటి వర్ణంతో ఉన్నందుకు శ్యాముడు, వేణువు వాయిస్తూ అందరినీ ఆకట్టుకున్నందుకు మురళీమోహనుడు, యశోదకు ప్రియమైన కుమారుడిగా యశోదానందనుడు, దేవకీకి పుత్రుడిగా దేవకీనందనుడు వంటి పేర్లు ప్రసిద్ధి చెందాయి.అంతేకాదు.. కృష్ణుడి పేర్లలో ఆయన చేసిన కార్యాలు, ఆయనకు ఉన్న సంబంధాలు, ఆయన వ్యక్తిత్వంలోని లక్షణాలు ప్రతిబింబిస్తాయి. అందుకే భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయంలో కృష్ణ నామస్మరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఏర్పడింది.

### వెన్న దొంగిలించాడా..లేక ప్రేమను పంచాడా?

చిన్ననాటి కృష్ణుడి లీలల్లో వెన్నదొంగతనం కథలు ప్రత్యేకంగా ప్రాచుర్యం పొందాయి. గోపికల ఇళ్లలోని వెన్నను కృష్ణుడు తన స్నేహితులతో కలిసి తీసుకునేవాడని పురాణ కథనాలు చెబుతాయి. దీనిని భక్తి సంప్రదాయంలో కేవలం చిలిపితనంగా కాకుండా ఒక ఆధ్యాత్మిక సంకేతంగా కూడా భావిస్తారు. మనసులోని అహంకారాన్ని తొలగించి, నిర్మలమైన భక్తిని స్వీకరించమనే సందేశానికి వెన్నలీలను ప్రతీకగా కొందరు ఆధ్యాత్మికవేత్తలు వివరిస్తారు. అందుకే కృష్ణుడి బాల్య లీలలు చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరినీ ఆకట్టుకుంటాయి.

### గోవర్ధన గిరి..ప్రకృతి పరిరక్షణకు సందేశం


కృష్ణుడి జీవితంలో గోవర్ధన ఘట్టానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. ఇంద్రుడి ఆరాధనకు బదులుగా గోవర్ధన పర్వతాన్ని, ప్రకృతిని, గోవులను గౌరవించాలని కృష్ణుడు ప్రజలకు సూచించాడని పురాణాలు చెబుతున్నాయి.

అనంతరం కురిసిన భారీ వర్షాల నుంచి ప్రజలను కాపాడేందుకు గోవర్ధన గిరిని ఎత్తి పట్టాడనే కథ ప్రసిద్ధి చెందింది.ఈ ఘట్టాన్ని నేటి కాలానికి అన్వయిస్తే ప్రకృతిని గౌరవించడం, నీరు- నేల- పర్యావరణాన్ని కాపాడుకోవడం అనే గొప్ప సందేశం కనిపిస్తుంది. ప్రకృతితో మానవ జీవనం విడదీయ రానిదని కృష్ణుడి గోవర్ధన లీల గుర్తు చేస్తుంది.

### కృష్ణుడి వేణువు వెనుక ఉన్న తత్వం

కృష్ణుడి చేతిలో వేణువు కనిపించడం భారతీయ కళా సంప్రదాయంలో ప్రత్యేకమైన ప్రతీకగా మారింది. వేణువులో తనదైన స్వరం ఉండదు.

దానిలోని ఖాళీ ద్వారానే సంగీతం వెలువడుతుంది. అందుకే భక్తి తత్వంలో మనిషి కూడా అహంకారాన్ని విడిచి భగవంతునికి సాధనంగా మారితే జీవితం మరింత అర్థవంతమవుతుందని వేణువు ద్వారా ప్రతీకాత్మకంగా వివరిస్తారు.



### మహాభారతంలో కృష్ణుడు..ఆయుధం పట్టని యోధుడు

మహాభారతంలో కృష్ణుడి పాత్ర అత్యంత కీలకమైనది. కురుక్షేత్ర యుద్ధంలో తాను ఆయుధం పట్టనని నిర్ణయించుకున్నప్పటికీ.. పాండవుల పక్షాన నిలిచాడు. అర్జునుడికి రథసారథిగా వ్యవహరించాడు. ఇక్కడే కృష్ణుడి మరో గొప్ప లక్షణం బయటపడుతుంది. యుద్ధంలో ఆయుధం పట్టకుండా కూడా మొత్తం యుద్ధ గమనాన్ని ప్రభావితం చేయగలిగిన వ్యూహకర్తగా ఆయన నిలిచాడు. శక్తి కంటే సరైన సమయంలో సరైన నిర్ణయం తీసుకోవడం, పరిస్థితిని అర్థం చేసుకోవడం, వ్యూహాన్ని మార్చడం ఎంత ముఖ్యమో కృష్ణుడి పాత్ర తెలియజేస్తుంది.

### 18 అధ్యాయాలు..ఒక మహత్తర జీవన సందేశం

కురుక్షేత్ర యుద్ధానికి ముందు అర్జునుడు తన బంధువులు, గురువులు, మిత్రులపై యుద్ధం చేయాల్సి రావడంతో తీవ్రంగా కలత చెందాడు. ఆ సమయంలో కృష్ణుడు అతనికి అందించిన బోధనే భగవద్గీతగా ప్రసిద్ధి చెందింది.భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలు ఉన్నాయి. కర్మ, జ్ఞానం, భక్తి, ధ్యానం, ఆత్మతత్వం, ధర్మం వంటి అనేక అంశాలను కృష్ణుడు వివరిస్తాడు. ఫలితంపై మాత్రమే దృష్టి పెట్టకుండా తన కర్తవ్యాన్ని నిజాయితీగా నిర్వర్తించాలనే కర్మయోగ సందేశం ప్రపంచవ్యాప్తంగా ఎంతో ప్రాచుర్యం పొందింది.

### స్నేహానికి ప్రతిరూపం..కుచేలుడితో బంధం

శ్రీకృష్ణుడుకుచేలుడి స్నేహం భారతీయ సంప్రదాయంలో ఆదర్శంగా నిలిచింది. బాల్య స్నేహితుడైన కుచేలుడు పేదరికంలో ఉన్నప్పటికీ కృష్ణుడిని కలుసుకోవడానికి ద్వారకకు వెళ్తాడు. తన స్నేహితుడు తీసుకొచ్చిన సాధారణ అటుకులను కృష్ణుడు ఎంతో ప్రేమతో స్వీకరించాడని పురాణ కథనం.ఈ కథలో సంపద, హోదా, అధికారాలకు స్నేహంలో స్థానం లేదనే సందేశం కనిపిస్తుంది. మనిషి వద్ద ఉన్నది ఎంత అన్నది కాదు.. అతని మనసులో ఉన్న ప్రేమ ఎంత అన్నదే ముఖ్యమని కృష్ణకుచేలుల స్నేహం చెబుతుంది.

### ద్వారక నిర్మాణం.. దూరదృష్టికి నిదర్శనం

మథురపై పదేపదే దాడులు జరుగుతున్న సమయంలో ప్రజల రక్షణ కోసం కృష్ణుడు సముద్రతీర ప్రాంతంలో ద్వారకను నిర్మించాడని పురాణాలు చెబుతున్నాయి. శత్రువుతో నిరంతరం పోరాడటమే పరిష్కారం కాదని, ప్రజల భద్రత కోసం వ్యూహాత్మకంగా కొత్త ప్రాంతానికి తరలిపోవచ్చనే దూరదృష్టిని కృష్ణుడి ద్వారక ఘట్టం ప్రతిబింబిస్తుంది. అందుకే కృష్ణుడిని కేవలం ఆధ్యాత్మిక నాయకుడిగానే కాకుండా అసాధారణమైన నిర్ణయాలు తీసుకున్న నాయకత్వ ప్రతీకగా కూడా పలువురు భావిస్తారు.

### కృష్ణ తత్వం.. నేటి తరానికి అవసరం

ప్రస్తుత సమాజంలో ఒత్తిళ్లు, పోటీ, ఆందోళనలు పెరుగుతున్న సమయంలో కృష్ణుడి బోధనలు మరింత ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. కష్టాలు వచ్చినప్పుడు భయపడకుండా పరిస్థితిని అర్థం చేసుకోవడం.. చేయాల్సిన కర్తవ్యాన్ని నిజాయితీగా చేయడం.. ఫలితం గురించి అతిగా ఆందోళన చెందకపోవడం.. ధర్మం వైపు నిలబడటం.. ప్రకృతిని గౌరవించడం.. స్నేహాన్ని విలువైనదిగా భావించడం.. ఇవన్నీ కృష్ణ తత్వంలోని ప్రధాన సందేశాలుగా నిలుస్తున్నాయి.కృష్ణుడి జీవితాన్ని పరిశీలిస్తే బాల్యంలో ఆనందం, యవ్వనంలో ధైర్యం, నాయకత్వంలో వ్యూహం, స్నేహంలో ఆప్యాయత, ధర్మంలో నిబద్ధత, బోధనలో జ్ఞానం కనిపిస్తాయి. అందుకే వేల సంవత్సరాలు గడిచినా కృష్ణుడి వ్యక్తిత్వం భారతీయుల హృదయాల్లో సజీవంగా నిలిచింది.

### కృష్ణుడు ఒక దేవతా స్వరూపం మాత్రమే కాదు..ఒక జీవన తత్వం

శ్రీకృష్ణుడి కథలను వినడం, ఆయనను పూజించడం ఒక ఆధ్యాత్మిక అనుభూతి అయితే.. ఆయన బోధనలను జీవితంలో ఆచరించడం అసలైన కృష్ణారాధన. ధర్మాన్ని విడిచిపెట్టకుండా కర్తవ్యాన్ని నిర్వర్తించడం, ప్రేమను పంచడం, ప్రకృతిని కాపాడడం, కష్టాల్లో ధైర్యంగా నిలబడటం, వివేకంతో నిర్ణయాలు తీసుకోవడంఇదే కృష్ణ తత్వం.అందుకే శ్రీకృష్ణ జన్మాష్టమి ఒక్కరోజు పండుగగా కాకుండా.. ప్రతి మనిషి తన జీవితంలో కృష్ణుడి ఒక మంచి లక్షణాన్ని ఆచరించుకునే సందర్భంగా మారితే అదే ఈ పర్వదినానికి నిజమైన సార్థకత.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు: సీఐ వెంకటేశ్వర్లు



**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 03:-**రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ప్రజలు శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం సిద్ధవటం పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, గొడవలు, వివాదాలు, అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లోకి అనుమానాస్పద వ్యక్తులు ఎవరైనా వచ్చినా, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో సిద్ధవటం ఎస్ఐ హారిక పాల్గొన్నారు.

## వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి: ఎస్ఐ డి.జగదీశ్వరరెడ్డి

**లింగాల మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**మండల పరిధిలోని గ్రామాల్లో ఈ మాసంలో జరగబోయే వినాయక చవితి ఉత్సవాలకు సంబంధించిన అనుమతులన్నీ ఆన్లైన్లో అప్లై చేసుకున్నట్లైతే వాటికి లింగాల పోలీస్ స్టేషన్లో అనుమతి మంజూరు చేస్తామని గురువారం ఎస్ఐ డి.జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. గ్రామాల్లో వినాయక విగ్రహ మంటపాల వద్ద సౌండ్ పొల్యూషన్ కారణంగా ప్రజలు ఇబ్బందులకు గురి కాకుండా ఉండేందుకు డీజేలకు అనుమతి నిరాకరించామన్నారు. మండపాల వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎవరైనా మద్యం సేవించి అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు

## కారుమంచి గోపాల్ కుటుంబానికి జనసేన నాయకుల ఆర్థిక సాయం



**దేవనకొండ మన జనప్రగతి సెప్టెంబరు 03:-**దేవనకొండ మండలంలోని బీసీ కాలనీకి చెందిన కారుమంచి గోపాల్ హఠాత్తుగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన నాయకులు వెంటనే ఆయన కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభూతి తెలిపారు.అనంతరం మృతుడి కుటుంబానికి తమ వంతు సహాయంగా రూ.5,016 ఆర్థిక సాయం అందజేశారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచేందుకు ముందుకు వచ్చిన జనసేన నాయకులకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలూరు మార్కెట్ యార్డు డైరెక్టర్ బోయ సరోజ, మాజీ సైనికుడు ఏ. ఉచ్చిరప్ప, గొల్ల రామాంజనేయులు, పరమేశు తదితర జనసేన నాయకులు పాల్గొని ఆర్థిక సాయం అందజేశారు.

## ఇంజనీరింగ్ అసిస్టెంట్ కుటుంబానికి యూనియన్ బ్యాంక్ రూ.1.20 కోట్ల ప్రమాద బీమా అందజేత.

**- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి.**



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**ఓర్వకల్లు మండలం కన్నమడకల గ్రామంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న ఏ.ఎం. రంగస్వామి ఏప్రిల్ 1వ తేదీన ఓర్వకల్లు ఎయిర్పోర్ట్ దగ్గర రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన నేపథ్యంలో తన జీతభత్యాలను యూనియన్ బ్యాంక్ ద్వారా పొందుతూ ఉన్నందున యూనియన్ బ్యాంక్ వారి ద్వారా వారి కుటుంబ సభ్యులకు కోటి 20 లక్షల రూపాయల బీమా చెక్ ను ఆయన తల్లి లక్ష్మమ్మ, భార్య పుష్ప లత లకు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి గురువారం అందచేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ ద్వారా జీతాలు పొందుతున్న శాశ్వత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు ప్రమాదవశాత్తు మరణిస్తే కోటి 20 లక్షల రూపాయలు అందజేస్తుందని తెలిపారు. బీమా పథకాల పట్ల అందరూ అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందని కలెక్టర్ తెలిపారు. యూనియన్ బ్యాంక్ రీజినల్ మేనేజర్ డి. అనిల్ కుమార్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఎదుభూషణ్ రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ డి. హుసేన్ వలి, తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో గ్రావెల్.. డ్రైనేజీకి అంతరాయం


- మాధవరం-1లో పారిశుద్ధ్య సమస్యపై గ్రామస్థుల ఆందోళన





**సిద్ధవటం మన జనప్రగతి సెప్టెంబరు 03:-**మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలో కడపచెన్నై జాతీయ రహదారి పక్కన ఉన్న కాలువలో కొంతమంది దుకాణదారులు, గృహ యజమానులు గ్రావెల్ పోయడంతో మురుగునీటి పారుదలకు అంతరాయం ఏర్పడింది. కాలువలో గ్రావెల్ పేరుకుపోవడంతో మురుగునీరు నిలిచిపోయి పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వెదజల్లుతోంది. కాలువలో నీరు నిల్వ ఉండటంతో దోమలు వృద్ధి చెందే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు కురిస్తే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారే ప్రమాదం ఉందన్నారు. సంబంధిత అధికారులు వెంటనే కాలువను పరిశీలించి, అందులో వేసిన గ్రావెల్‌ను తొలగించి మురుగునీరు సజావుగా ప్రవహించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి: మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**స్వరాజ్యనగర్ పరిధిలోని 7,8వ వార్డు సచివాలయాలను మున్సిపల్ కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాలకు వచ్చిన స్థానికులతో మాట్లాడి, ప్రభుత్వ పరంగా అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రజా కేంద్రాలుగా పనిచేస్తున్న వార్డు సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకు సచివాలయంలో ప్రజలకు సిబ్బంది అందుబాటులో ఉండాలని స్పష్టం చేశారు.అనంతరం సచివాలయ సిబ్బందితో ఈ-కేవైసీ, పిల్లల ఆధార్ నమోదు, తల్లిపిల్లల మ్యాపింగ్, మనమిత్ర ట్రైనింగ్ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డు సచివాలయాలు ప్రజలకు అందిస్తున్న సేవలపై సానుకూల ప్రజాభిప్రాయం (పబ్లిక్ పాజిటివ్ పర్సెప్షన్) మరింత పెరిగేలా సిబ్బంది పనిచేయాలని కమిషనర్ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆదేశించారు.

## బాల్య వివాహాలపై అవగాహన కార్యక్రమం




**తొండూరు మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**మండల పరిధిలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన " బాల్య వివాహాలు - టీనేజ్ ప్రెగ్నెన్సీ" అనే అంశం పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ గవాస్కర్ రెడ్డి మాట్లాడుతూ...18 సంవత్సరం లోపు అమ్మాయిలకు 21 సంవత్సరాల లోపు అబ్బాయిలకు పెళ్లిచేయకూడదని అట్లు చేసిన యెడల బాల్య వివాహ నిరోధక చట్టం2006 నిబంధనలు 2012 ప్రకారము రెండు సంవత్సరాల జైలు శిక్ష, 1లక్ష రూపాయల వరకు జరిమాన విధిస్తారని,చిన్న వయస్సులో వివాహాలు చేయడం వలన తల్లి మరియు శిశువు మరణించడం, మృత శిశువులు జన్మించడం, గర్భ స్రావాలు,ప్రసవ సమయం లో అధిక రక్తపోటు. ప్రసవం తర్వాత అధిక రక్తం కోల్పోవడం,మానసిక,శారీరక ఎదుగుదల లేకపోవటం,చదువు లేకపోవడం, సంసారం సరిగా అర్థం చేసుకోలేక త్వరగా విడాకులు తీసుకోవడం,ఒంటరిగా జీవించడం అనేక సమస్యలకు గురవుతారని, తల్లి తండ్రులు బలవంతం చేసి పెళ్ళికి సిద్ధమైన యెడల ఉపాధ్యాయులకు, అంగన్వాడి కార్యకర్తకు,మహిళా పోలీస్,ఆరోగ్య కార్యకర్తలకు మరియు మండల తహసీల్ధార్ వారికి సమాచారం అందించాలని వారు తెలిపారు. కావున అమ్మాయిలు బాగా చదువుకుని ఉన్నత స్థితికి చేరాలని బాల్య వివాహలకు దూరంగా ఉండాలని తెలిపారు.ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి డాక్టర్ గవాస్కర్ రెడ్డి హెల్త్ ఎడ్యుకేటర్ మల్లయ్య వ్యాయమ ఉపాధ్యాయులు మునలయ్య, స్థానిక ఆరోగ్య కార్యకర్తలు మంజుల, నాగేశ్వరి. ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై విద్యాశాఖ పర్యవేక్షణ ఏదీ..?

**- అధికారుల నిర్లక్ష్యంపై ప్రైవేట్ టీచర్ల యూనియన్ ఆగ్రహం**



**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**జిల్లాలోని ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని ప్రైవేట్ టీచర్స్, లెక్చరర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం రాజు ఆరోపించారు. జిల్లాలో సుమారు వెయ్యి కి పైగా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నప్పటికీ,వాటిపై విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ,తనిఖీలు సక్రమంగా జరగడం లేదని ఆయన విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలలు కార్పొరేట్, బడ్జెట్ స్కూల్స్ పేర్లతో నిర్వహిస్తూ విద్యార్థుల నుంచి వివిధ రకాల ఫీజులు వసూలు చేస్తున్నాయని గడ్డం రాజు పేర్కొన్నారు. పాఠశాలల నిర్వహణకు సంబంధించిన జీవో ఎంఎస్ నెం.1ను చట్టబద్ధంగా అమలు చేయడంలో విద్యాశాఖ అధికారులు విఫలమయ్యారని ఆరోపించారు. అంతేకాకుండా పండుగ సెలవు రోజుల్లో ప్రత్యేక తరగతులు, క్యాంపెయిన్లు, ఫీజు ఫాలోఅప్, వర్క్‌షాప్‌ల పేరుతో ప్రైవేట్ ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. ఈ సమస్యలపై పలుమార్లు జిల్లా విద్యాశాఖ అధికారి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు, ఉప విద్యాశాఖ అధికారులు తదితరులకు వినతిపత్రాలు సమర్పించినప్పటికీ పరిస్థితిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వ పాఠశాలలను మాత్రమే పర్యవేక్షిస్తున్న అధికారులు ప్రైవేట్ పాఠశాలల వైపు మాత్రం కన్నెత్తి చూడటం లేదని ఆయన విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో నిబంధనలు అమలవుతున్నాయా లేదా,ఉపాధ్యాయులకు ఎదురవుతున్న సమస్యలు ఏమిటి అనే అంశాలపై అధికారులు ఇప్పటికైనా సమగ్రంగా తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారులు తమ బాధ్యతలను గుర్తించి ప్రైవేట్ పాఠశాలలపై పర్యవేక్షణ పెంచడంతో పాటు, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గడ్డం రాజు ఒక ప్రకటనలో కోరారు.

## యువతకు 20 లక్షల ఉద్యోగాలు నిరుద్యోగ భృతి ఎక్కడ..?

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి నెలా రూ.3,000 నిరుద్యోగ భృతి అందజేస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి ఎన్.డి. విజయ జ్యోతి విమర్శించారు.గురువారం కడపలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు.ప్రభుత్వం ఏర్పడి సుమారు 2 సంవత్సరాల 2 నెలల 22 రోజులు గడిచినా, 20 లక్షల ఉద్యోగాల హామీపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ చూపలేదని విజయ జ్యోతి అన్నారు. మెగా డీఎస్సీ2025 ద్వారా 16,347 పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టినప్పటికీ,ఆ ప్రక్రియ కూడా వివాదాలు,గందరగోళంతో కొనసాగుతోందని ఆమె పేర్కొన్నారు.ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, 20 లక్షల ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలని,అర్హులైన నిరుద్యోగ యువతకు నెలకు రూ.3,000 నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని కాంగ్రెస్ పార్టీ తరపున డిమాండ్ చేస్తున్నామని విజయ జ్యోతి తెలిపారు.

## పేదింట్లో మెరిసిన ఆణిముత్యం

- తల్లిదండ్రుల కష్టాన్ని వృథా చేయని బిడ్డ..
- నీట్‌లో ప్రతిభ చాటి ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు







**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-** కూరగాయల మార్కెట్‌లో టిఫిన్ బండి నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ.. తమ పిల్లలను ఉన్నతంగా చదివించాలనే తల్లిదండ్రుల కలను ఓ బిడ్డ నిజం చేసింది. ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకోకుండా, లక్షలాది రూపాయలు వెచ్చించి ఖరీదైన కోచింగ్ తీసుకోకుండా ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకుంటూ కష్టపడి నీట్ పరీక్షలో ప్రతిభ కనబరిచి ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించింది. పేద కుటుంబంలో పుట్టి తన ప్రతిభతో ఉన్నత శిఖరాలను అధిరోహించిన జాహ్నవి కృషిని పలువురు అభినందిస్తున్నారు.పత్తికొండ పట్టణంలోని కుమ్మరి వీధికి చెందిన ఉప్పర భాగ్యలక్ష్మి, రాము దంపతులకు కుమార్తె జాహ్నవి, కుమారుడు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం తల్లిదండ్రులు కూరగాయల మార్కెట్‌లో టిఫిన్ బండి నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ తమ పిల్లల చదువుకు ఎలాంటి లోటు రాకుండా జాగ్రత్త పడ్డారు. తల్లిదండ్రుల కష్టాన్ని కళ్లారా చూసిన జాహ్నవి, వారి ఆశయాలను నెరవేర్చాలనే పట్టుదలతో చదువుపై దృష్టి సారించింది.జాహ్నవి మొదటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యాభ్యాసం కొనసాగించింది. అనంతరం ఇంటర్మీడియట్‌ను ఏపీఆర్‌జేసీ బనవాసిలో పూర్తి చేసింది. చిన్ననాటి నుంచే వైద్య విద్యను అభ్యసించి ఎంబీబీఎస్ డాక్టర్ కావాలనే లక్ష్యంతో నీట్ పరీక్షకు సిద్ధమైంది. పట్టుదలతో చదివి నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచింది.ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో బీసీ-డీ కేటగిరీ కింద ఎస్వీయూ పరిధిలో ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించింది. దీంతో జాహ్నవి కుటుంబంలో ఆనందం వెల్లివిరిసింది. తమ కష్టాన్ని వృథా చేయకుండా కుమార్తె ప్రభుత్వ ఎంబీబీఎస్ సీటు సాధించడం ఎంతో సంతోషంగా ఉందని తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు.పేద కుటుంబం నుంచి వచ్చినా పట్టుదల, కృషితో ప్రభుత్వ వైద్య సీటు సాధించిన జాహ్నవిని కుటుంబ సభ్యులు,బంధువులు, స్నేహితులు అభినందించారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి వైద్యురాలిగా సేవలందించాలని ఆకాంక్షించారు.

## అభివృద్ధి పథంలో నలకదొడ్డి

- ఎమ్మెల్యే చొరవతో గ్రామంలో అభివృద్ధి పనులు వేగవంతం
- నలకదొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్



**పత్తికొండ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-** పత్తికొండ నియోజకవర్గంతో పాటు మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు చొరవతో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయని టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ తెలిపారు. గ్రామంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నట్లు పేర్కొన్నారు.నలకదొడ్డి నుంచి దేవనబండకు వెళ్లే ప్రధాన రహదారికి ఇరువైపులా దట్టంగా ముళ్లకంపలు పెరగడంతో వాహనదారులు, గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, టీడీపీ తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి, నలకదొడ్డి మాజీ సర్పంచ్ బత్తిన లోకనాథ్ ఆదేశాల మేరకు గురువారం రహదారి వెంట ముళ్లకంపల తొలగింపు కార్యక్రమాన్ని చేపట్టారు.'వీబీజీ రామ్‌జీ' ఉపాధి కూలీలతో కలిసి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిన రాజశేఖర్ శ్రమదానం చేసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లకంపలను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు గ్రామంలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని తెలిపారు.ఎమ్మెల్యే సహకారంతో గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులకు ప్రాధాన్యత కల్పిస్తూ దశలవారీగా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని చెప్పారు. నలకదొడ్డి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు.అభివృద్ధి పనులకు గ్రామ ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ఉపాధి కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# పశువుల షెడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించిన ఎమ్మెల్యే శ్రీధర్



**చిట్వేలి మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–పల్లె పండుగ 3.0లో భాగంగా వీబీజీ రామ్ జి నిధులతో రైల్వే కోడూరు మండలం శెట్టిగుంట గ్రామ పంచాయతీ పెద్దపాడు గ్రామంలో చేపట్టనున్న పశువుల షెడ్డు నిర్మాణ పనులకు రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్, రైల్వే కోడూరు నియోజకవర్గం టీడీపీ యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు రైతులు, పశుపోషకుల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేసి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని అన్నారు. పశుసంపద గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. పశువుల సంరక్షణకు అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా రైతులు, పశుపోషకులకు ఎంతో ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. శెట్టిగుంటలో నిర్మించనున్న పశువుల షెడ్డు స్థానిక రైతులకు, పశుపోషకులకు ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. యువనేత ముక్కా సాయి వికాస్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. పల్లె పండుగ 3.0 ద్వారా గ్రామాల్లో ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారని తెలిపారు. రైతులు, పశుపోషకుల సంక్షేమానికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతకు పల్లె పండుగ 3.0 కార్యక్రమం నిదర్శనంగా నిలుస్తోందని అన్నారు. గ్రామాల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తూ, రైతులు, పశుపోషకుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెర్మన్ జయప్రకాశ్, ఎన్‌డిఏ కూటమి నేతలు, సంబధిత అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ట్రిపుల్ ఐటీలో 8 మంది అధ్యాపకులకు అదనపు బాధ్యతలు



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీ లో పనిచేస్తున్న 8 మంది అధ్యాపకులకు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ వర్సిటీ అధికారులు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరు అధ్యాపకులుగా తమ విధులు నిర్వర్తిస్తూనే విద్యార్థుల పరంగా ఈ అదనపు బాధ్యతలు చూడాల్సి ఉంటుంది. ట్రిపుల్ ఐటీ లో ఫిజిక్స్ విభాగపు అధిపతిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఎం. భాస్కరయ్య ను పరిశోధన, అభివృద్ధి విభాగము, ఉన్నత విద్య పోటీ పరీక్షల విభాగాలకు కోఆర్డినేటర్ గా నియమించారు. అలాగే బయాలజీ విభాగంలో అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ ఏ. జోబ్ రోజర్ బిన్నీ ని ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్ గా నియమించారు. కెమిస్ట్రీ విభాగపు అధిపతిగా విధులు నిర్వహిస్తున్న ఏ.వి. దుర్గా కిషోర్ రెడ్డి ని అసోసియేట్ ఎస్టాబ్లిష్మెంట్ కోఆర్డినేటర్ గానూ, మ్యాథమెటిక్స్ విభాగంలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జె. దీప్తి ని చీఫ్ మెస్ కోఆర్డినేటర్ గా నియమించారు. అదేవిధంగా లైబ్రరీ విభాగంలో అసిస్టెంట్ లైబ్రేరియన్ గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ డి. కోనప్ప ను ఇంటర్నల్ క్వాలిటీ అస్యూరెన్స్ సెల్ కోఆర్డినేటర్ గా, కంప్యూటర్ సైన్స్ విభాగంలో అధ్యాపకురాలుగా విధులు నిర్వహిస్తున్న పి. ఉదయ్ శ్రీ ని పూర్వ విద్యార్థుల వ్యవహారాలు, విస్తరణ కార్యక్రమాల విభాగానికి కోఆర్డినేటర్ గా నియమించారు. అలాగే మేనేజ్మెంట్ విభాగంలో అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కే. కళ్యాణ్ చక్రవర్తి ని సమాచార హక్కు చట్ట విభాగానికి కోఆర్డినేటర్ గా, ఐటీ విభాగంలో మెంటార్గా విధులు నిర్వహిస్తున్న ఎస్ రామకృష్ణ ను డైరెక్టర్ పర్సనల్ అసిస్టెంట్ నియమించారు. అలాగే డైరెక్టర్ పీఏగా విధులు నిర్వహిస్తున్న మహబూబ్ భాషా ప్రజా సంబంధాలు, ప్రచారం, మీడియా సమాచార మార్పిడిని సమన్వయం చేసే బాధ్యతను అప్పగించారు. సదరు అధ్యాపకులు వారి అధ్యాపక విధులని నిర్వహిస్తూ పై విధంగా అప్పగించిన అదనపు బాధ్యతలను నిర్వహిస్తారని అధికారులు తెలియజేశారు. ఈ సందర్భంగా సదరు అధ్యాపకులని అధ్యాపక అధ్యాపకేతర బృందం అభినందించారు.

# సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యునిగా కామ్రేడ్ జి.ఈశ్వరయ్య ఎన్నిక

● కడప నుంచి ఢిల్లీ దాకా సాగిన ఉద్యమ ప్రస్థానం ● ఏపీ కమ్యూనిస్టు ఉద్యమానికి గర్వకారణం



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) జాతీయ కార్యవర్గ సభ్యునిగా ఆంధ్రప్రదేశ్ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ జి. ఈశ్వరయ్య ఎన్నిక కావడం పట్ల పార్టీ శ్రేణులు, ప్రజా సంఘాలు, కార్మిక ఉద్యమ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి. చంద్రశేఖర్, పులివెందుల ఏరియా కార్యదర్శి బి. వెంకట రాములు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కామ్రేడ్ జి. ఈశ్వరయ్య విద్యార్థి దశ నుంచే కమ్యూనిస్టు ఉద్యమంలో చురుకుగా పనిచేస్తూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. కార్మికులు, కర్షకులు, వ్యవసాయ కూలీలు, యువత, మహిళలు, పేదలు, అణగారిన వర్గాల హక్కుల సాధన కోసం ఆయన సాగించిన ఉద్యమ ప్రస్థానం కడప నుంచి ఢిల్లీ వరకు కొనసాగిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సీపీఐని బలోపేతం చేయడంలో, ప్రజా ఉద్యమాలను విస్తరించడంలో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాటాలు నిర్వహించడంలో ఈశ్వరయ్య కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం, లౌకికవాదం, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం ఆయన నిరంతరం తన గొంతును వినిపిస్తున్నారని తెలిపారు. దేశంలో కార్పొరేట్ అనుకూల విధానాలు, కార్మికులు, రైతులకు వ్యతిరేక విధానాలు అమలవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో సీపీఐ జాతీయ కార్యవర్గంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కామ్రేడ్ జి. ఈశ్వరయ్య ఎన్నిక కావడం రాష్ట్ర ప్రజా ఉద్యమాలకు మరింత బలాన్ని చేకూరుస్తుందని వారు అన్నారు. రాష్ట్ర ప్రజల సమస్యలను జాతీయ స్థాయిలో మరింత సమర్థవంతంగా ప్రస్తావించేందుకు ఈ అవకాశం దోహదపడుతుందని తెలిపారు. కామ్రేడ్ జి. ఈశ్వరయ్య నాయకత్వంలో సీపీఐ మరింత బలోపేతం కావాలని, ప్రజా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం కావాలని ఆకాంక్షిస్తూ ఆయనకు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# గ్రంథాలయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● 2026 - 27 వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించిన జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు



**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో 202627 సంవత్సరానికి సంబంధించిన సర్వసభ్య సమావేశాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు భూపతి రాజు ఈశ్వర్ రాజు వర్మ (సాయిబాబు రాజు) అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లాలోని గ్రంథాలయాలను మరింత అభివృద్ధి చేయడం, పాఠకులకు మెరుగైన సేవలు అందించడం, గ్రంథాలయాల్లో అవసరమైన మౌలిక వసతులను కల్పించడం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. పాఠకుల అవసరాలకు అనుగుణంగా గ్రంథాలయ సేవలను విస్తరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిపాదనలు పరిశీలించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కె.జె.ఎస్.ఎల్. కుమారితో పాటు ఆమోద సంఘ సభ్యులైన జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా పంచాయతీ శాఖ అధికారి, పౌర సంబంధాల శాఖ అధికారి, వయోజన విద్యాశాఖ అధికారి తదితర అధికారులు సమావేశానికి హాజరయ్యారు. గ్రంథాలయ సంస్థకు సంబంధించిన పలు అంశాలపై వచ్చిన ప్రతిపాదనలను అధికారులు పరిశీలించి ఆమోదించారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ అధికారులు కె. కిషోర్, ఎం. శ్రావ్య, సాయి, వీర్రాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఖండాంతరాలు దాటిన అభిమానం

● గల్ఫ్ దేశాల్లో వైఎస్సార్‌కు ఘన నివాళులు



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, మహానేత డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి 17వ వర్ధంతి సందర్భంగా ఆయనపై ఉన్న అభిమానాన్ని గల్ఫ్ దేశాల్లోని తెలుగు ప్రజలు చాటుకున్నారు. కువైట్, దుబాయ్ (యూఏఈ), ఖతార్, బహరైన్, సౌదీ అరేబియాలోని జుబైల్, ఒమాన్ (మస్కట్) దేశాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభిమానులు ఘనంగా నివాళులు అర్పించారు. కువైట్‌లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముమ్మడి బాలిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా, దుబాయ్‌లో గల్ఫ్ కో–కన్వీనర్ మహమ్మద్ జిలాన్ బాషా ఆధ్వర్యంలో ప్రముఖ పారిశ్రామికవేత్త సుధాకర్ రెడ్డి, ప్రసన్న సోమిరెడ్డి పర్యవేక్షణలో వైఎస్సార్ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఖతార్‌లో కన్వీనర్ జాఫర్ హుస్సేన్, గల్ఫ్ కో–కన్వీనర్ దొండపాటి శశికిరణ్ ఆధ్వర్యంలో నివాళులు అర్పించారు. అలాగే బహరైన్‌లో కన్వీనర్ ఓర్సు నాగరాజు, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో, సౌదీ అరేబియాలోని జుబైల్‌లో కన్వీనర్ షేక్ ఇలాహి ఆధ్వర్యంలో, ఒమాన్‌లో కన్వీనర్ భాస్కర్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ అందించిన సంక్షేమ పథకాలను గుర్తు చేసుకుంటూ 'జోహార్ వైఎస్సార్' అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆరోగ్యశ్రీ, 104, 108 ఉచిత అంబులెన్స్ సేవలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి అనేక ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేశారని వారు గుర్తుచేశారు. ముఖ్యంగా పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమంతో పాటు పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తీసుకురావడంలో వైఎస్సార్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రజల జీవితాల్లో చెరగని ముద్ర వేశాయని, భూమి, ఆకాశం, సూర్యచంద్రులు ఉన్నంతకాలం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోతారని వారు పేర్కొన్నారు.

# మనసుకు తల్లి వంటిది కళ: వై.వి.యు ప్రిన్సిపల్ ఆచార్య టి.శ్రీనివాస్



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–కళ మనసుకు తల్లి వంటిది, అలసిన మనసుకు ఆనందాన్ని, ఆందోళనతో నిండిన హృదయానికి ప్రశాంతతను సమాజంలో చక్కటి గుర్తింపును ఇస్తుందని యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రధానాచార్యులు ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో కర్ణాటక సంగీతం, కీబోర్డ్, కూచిపూడి సర్టిఫికెట్ కోర్సులకు ప్రాయోగిక పరీక్షల సందర్భంగా జరిగిన ప్రారంభ సమావేశానికి ప్రిన్సిపల్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడుతూ నిజమైన ధనవంతుడు అంటే కేవలం సంపద కలిగినవాడు కాదు; కళను ఆస్వాదిస్తూ, కళాత్మకంగా జీవితాన్ని గడిపేవాడే నిజమైన ధనవంతుడన్నారు. అందుకే మనం కళలను ప్రోత్సహించాలి, కళాకారులను గౌరవించాలి, మనలోని సృజనాత్మకతను వెలికితీయాలన్నారు. కళలను కాపాడుకుందాం.. కళాకారులను ప్రోత్సహిద్దాం.. కళాత్మకంగా జీవిద్దాం.. కళలను చిరకాలం సజీవంగా నిలుపుదాం అని స్పష్టం చేశారు. ఏ రంగంలో పనిచేసే వారికైనా కళ, నైపుణ్యం, మేధస్సు ఎంతో అవసరం అని తెలిపారు. జీవితంలో ఎదురయ్యే ఒత్తిడిని నియంత్రించుకొని, దాని నుంచి బయటపడానికి కళలు తోడ్పడతాయన్నారు. కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ టి. లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయం అందించే శిక్షణతో నైపుణ్యతను సాధించి సమాజంలో కళాకారుడుగా గుర్తింపుని తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావు మాట్లాడుతూ విశ్వవిద్యాలయ అధికారుల సహకారంతో లలిత కళల విభాగంలోని రంగస్థలం కలల విభాగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. కూచిపూడి, కీబోర్డ్, కర్నాటిక్ సంగీతం సర్టిఫికెట్ కోర్సులు 2021 –22 విద్యా సంవత్సరంలో ప్రారంభం కాగా నాలుగు బ్యాచ్లు పూర్తి అయ్యాయని ,477మంది విద్యార్థులు విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకున్నారని తెలిపారు. థియేటర్ ఆర్ట్స్ సహాయ ఆచార్యులు (కాంటాక్ట్) డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్ రెడ్డి సభా సమన్వయం చేశారు. కోర్స్ గురించి వివరించారు.

# జాతీయస్థాయి యోగా స్పోర్ట్స్ పోటీలకు ఎంపిక

● ఆ క్రీడాకారులకు జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డిచే సత్కారం



**వేంపల్లె మన జన ప్రగతి సెప్టెంబర్ 03:**–జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ పోటీలకు జిల్లాకు చెందిన ఇరువురు ఎంపికయ్యారు. ఆగస్టు 29, 30 తేదీలలో విశాఖపట్నం ఇందిరప్రియదర్శిని స్టేడియంలో జరిగిన 51వ ఆంధ్రప్రదేశ్ యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్–2026లో ప్రొద్దుటూరు కడపకు చెందిన ఇరువురు సత్తా చాటారు. 21–25 సంవత్సరాల మహిళల విభాగంలో ప్రొద్దుటూరు కి చెందిన కృష్ణవేణి 4వ స్థానంలో నిలిచి కన్సోలేషన్ పతకం ప్రశంసా పత్రం సాధించగా, 45 సంవత్సరాల పైబడిన పురుషుల విభాగంలో కడప పట్టణానికి చెందిన శ్రీరాములు రెడ్డి 4వ స్థానంలో నిలిచి కన్సోలేషన్ పతకం ప్రశంసా పత్రం , సాధించి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు వీరు ఇరువురు ఈ నెల 29న బీహార్ రాష్ట్రం పాట్నాలో జరగనున్న జాతీయ స్థాయి యోగా స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్ పోటీలకు ఎంపికయ్యారని జిల్లా సెక్రటరీ తేజ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు మారం శ్రీకాంత్ రెడ్డి నంది పల్లె లోని తన నివాసానికి క్రీడాకారులను సాదరంగా ఆహ్వానించి వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు రాచవీటి మారన్న, ఈసీ మెంబర్లు రాజు, శ్రీరామ్ రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–కర్నూలు యూనిట్‌లో విధులు నిర్వహిస్తున్న హోంగార్డు కే.కృష్ణ ఏప్రిల్ 18 న గుండెపోటుతో మృతి చెందారు. ఆయన భార్య కే.సు నీతకు కారుణ్య నియామకం కింద హోంగార్డు ఉద్యోగం కల్పిస్తూ కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నియామక ఉత్త ర్వులు జారీ చేశారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏ ఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ శ్రీమతి కే.సునీతకు హోంగార్డు నియామక ఉత్తర్వుల పత్రశీ ను అందజేశారు. ఈ కార్యక్రమంలో కర్నూలు హోంగార్డ్స్ ఇన్‌చార్జ్ ఏఆర్ ఎస్.ఐ ఎస్.ఎల్.కాంతారెడ్డి హోంగార్డ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# దర్గా హొన్నూరులో ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ.1.14 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులుకు నాయకుల కృతజ్ఞతలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–బొమ్మనహాల్ మండల పరిధిలో దర్గా హొన్నూరు గ్రామం కణేకల్ రోడ్డు నుంచి హోన్నురు కాపు వీధి మీదుగా దర్గా వరకు ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణానికి రూ. 1.14 కోట్ల నిధులు మంజూరు కావడం జరిగిందని మండల నాయకులు కొత్తపల్లి మల్లికార్జున తెలిపారు, ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు, అనంతరం రోడ్డు నిర్మాణ పనులకు మండల నాయకుల చేతుల మీదుగా భూమిపూజ నిర్వహించారు, ఈ సందర్భంగా నాయకులు కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడుతూ.. చుట్టూ పక్కల గ్రామ ప్రజల రాకపోకలకు ఎంతో ఉపయోగకరంగా ఉండే ఈ రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు కృతజ్ఞతలు తెలిపారు, మరియు రహదారి నిర్మాణంతో గ్రామ ప్రజలతో పాటు దర్గా దర్శనానికి వచ్చే భక్తులకు కూడా రాకపోకలు సులభతరం కానున్నాయని అన్నారు, ఈ కార్యక్రమంలో సీనియర్ కొత్తపల్లి మల్లికార్జున, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ కొత్తపల్లి మహేంద్ర, మండల టీడీపీ కన్వీనర్ కే.మల్లన్న, మాజీ సర్పంచ్ వై.కేశప్ప, టీడీపీ అధికార ప్రతినిధి ఆనంద్, నాగరాజు, ఉద్దేహాల్ సంగప్ప, సైకిల్ షాప్ హనుమంతు, వి.ఎల్ రామాంజనేయులు, నాగప్ప, హనుమంతు, నాగరాజు, మహమ్మద్ రఫీ, సంతోష్, రాకేష్, రాజప్ప, భీమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనజనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
04- 09 - 2026

## గొర్తి వెంకటస్వామికి ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డు



**ఉరవకొండ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**ప్రముఖ విద్యావేత్త,రాయలసీమ ప్రజా సమైక్య అధ్యక్షులు,కక్కలపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొర్తి వెంకటస్వామి ఈ ఏడాది ప్రతిష్టాత్మక ఉత్తమ ప్రధానోపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు.ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 4న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్న ప్రత్యేక కార్యక్రమంలో గొర్తి వెంకటస్వామికి ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నారు.విద్యారంగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు, పాఠశాల అభివృద్ధికి చేస్తున్న కృషి, తాను పనిచేసిన ప్రతి చోట విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల మన్ననలు పొందేలా సేవలందించినందుకు గుర్తింపుగా ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.విద్యారంగంలో గొర్తి వెంకటస్వామి చేసిన సేవలకు ఇప్పటికే ఎన్టీఆర్ జాతీయ పురస్కారం కూడా లభించింది. వరుసగా ప్రతిష్టాత్మక పురస్కారాలు అందుకోవడం ద్వారా ఆయన విద్యాసేవలకు మరింత గుర్తింపు లభించినట్లయింది. ఈ సందర్భంగా పలువురు విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆయనకు అభినందనలు తెలిపారు.

## లింగదహాల్‌లో ఇంటింటి ప్రచారం..

### - ప్రజలతో మమేకమైన టీడీపీ శ్రేణులు



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**ఎమ్మెల్యే,ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఆదేశాల మేరకు మండల పరిధిలోని లింగదహాల్ గ్రామంలో మండల కన్వీనర్ కే. మల్లన్న,కావలి ప్రభు నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటి తెలుగుదేశం పార్టీ కార్యక్రమం నిర్వహించారు,ఈ సందర్భంగా మండల కన్వీనర్ కే.మల్లన్న మాట్లాడుతూ.. ఇంటింటికీ వెళ్లి తెదేపా పార్టీ చేసిన సేవ కార్యక్రమాలను ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి గురించి ప్రజలకు అవగాహన కల్పించారు,ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కే.మల్లన్న, నాయకులు కావలి ప్రభాకర్ నాయుడు,లేపాక్షి సైకిల్ షాప్ హనుమంతు, కురుబ నాగరాజు, తిప్పేస్వామి,మల్లి,కావలి జయరాములు,బోయ శ్రీనివాసులు, లింగదహాల్ గ్రామ టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్లోకా పాఠశాలలో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

### - కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**స్థానిక శ్లోకా పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు కరస్పాండెంట్ బండి నవనీశ్వర్ రెడ్డి వెల్లడించారు. గురువారం పాఠశాల ఆవరణలో విధ్యార్థులు శ్రీకృష్ణుడు,రాధ, గోపికల వలె అందమైన వేషధారణలతో అలరించారు. అలాగే పాఠశాల ప్రాంగణంలో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహించారు. భక్తిగీతాలు,నృత్య ప్రదర్శనలు,శ్రీకృష్ణుడి బాల్య లీలలు చూపరులను ఆకట్టుకున్నాయి.కరస్పాండెంట్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా విధ్యార్థులకు పండుగలు,భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఘనంగా రథోత్సవం

**తొండూరు మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**మండల పరిధిలోని తొండూరు గ్రామంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని గురువారం రథోత్సవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కుటుంబ సమేతంగా భక్తులు రథోత్సవాన్ని తిలకించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు కోరారు. రథోత్సవ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు భక్తులు, ప్రజలు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు.

## తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలి: డాక్టర్ శంకర్ శర్మ



**కర్నూలు బ్యూరో మన జన ప్రగతి సెప్టెంబర్ 03:-**వయసు మళ్ళిన వృద్ధ తల్లిదండ్రులను పిల్లలు ప్రేమగా చూసుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ శంకర్ శర్మ అన్నారు. గురువారం కర్నూలు సమీపంలోని ప్రజా నగర్ ఎదురుగా ఉన్నకాధంబరి టౌన్ షిప్ లో సేద వృద్ధాశ్రమానికి కెంట్ ప్యూరిటీ వాటర్ ఫిల్టర్ ను డాక్టర్.శంకర్ శర్మ అందించారు.ఈసందర్భంగా డాక్టర్.శంకర్ శర్మ మాట్లాడుతూ..వృద్దులకు సేవ చేయడం ఎంతో గొప్ప విషయం అన్నారు. అమెరికాలో స్థిర పడిన మధుసుధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఇరవై సంవత్సరాలుగా సేద వృద్ధాశ్రమం నిర్వహించడం హర్షించదగ్గ విషయం అన్నారు.వృద్ధాశ్రమంలో వృద్దులకు ఆరోగ్యం కోసం వాటల్ ఫిల్టర్ తన వంతు సహయంగా ఇచ్చానన్నారు.కలుషిత నీరు త్రాగడం వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని అందువల్ల ప్యూరిఫై వాటల్ ఫిల్టర్ ఇచ్చాన్నారు.ప్రస్తుతం ఎల్ నీనో ప్రభావం మరియు ఇతర దేశాల్లో యుద్ధ వాతావరణం ఏర్పడినందున నిత్యవసర వస్తువుల ధరలు పెరిగాయని దీంతో వృద్ధాశ్రమాల నిర్వహన కష్టంగా మారిందన్నారు.సేద వృద్ధాశ్రమానికి తనవంతు సహయంగా ఎల్లప్పుడు ఉంటుందన్నారు.దాతలు ముందుకు వచ్చి వారికి తోచినంత సహయం వృద్ధాశ్రమాలకు అందించాలని సూచించారు. తల్లిదండ్రులను వృద్ధాశ్రమాలకు పంపడం సరికాదని,చివరి దశలో వారిని ప్రేమగా చూసుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో సేద వృద్ధాశ్రమం నిర్వహాకులు దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.

## త్రాగునీరు ఇచ్చి పుణ్యం కట్టుకోండి మహాప్రభో..





**వీరబల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**ఒకపక్క త్రాగునీరు లేక మండలంలోని పలు గ్రామాలు అల్లాడుతుంటే మరో ప్రక్క అదంతా మనకెందుకులే అన్నట్లుగా ఫ్రీ ముసుగులో ఇసుక దోపిడీ జరుగుతూనే ఉంది. పట్టించుకోవలసిన అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు తాము ఏమి చూడనట్లు అసలు ఇసుక రవాణా జరిగినట్లు వ్యవహరిస్తుండడం తో మండలంలోని పలు గ్రామాలలో నీటి ఎద్దడి కొనసాగుతోంది.మండలంలోని బొంగవండ్లపల్లె ప్రాంతం నదికి దగ్గరగా ఉండటంతో నిత్యం ట్రాక్టర్లతో ఇసుక అక్రమ రవాణా చేస్తున్న కారణంగా భూగర్భ జలాలు అడుగంటి త్రాగునీటికి సైతం నోచుకోలేక ప్రజలు విలువిలాడుతున్నారు.పట్టించుకోవాల్సిన నాయకులు అధికారులు మాత్రం ఈ గ్రామం వైపు కన్నెత్తి చూసిన పాపన పోలేదు.తాగునీటి కోసం కన్నీరు పెడుతున్న తమ గోడు అటు నాయకులకు గానీ ఇటు అధికారులకు గానీ తెలిపినా పట్టించుకోలేదని గ్రామస్తులు వాపోతున్నారు. త్రాగునీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళితే ఆ వ్యవసాయ దారుడు నానా మాటలు అంటున్నారని మా పొలాల వద్దకు రావద్దని కఠినంగా మాట్లాడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.నాయకులు,అధికారులు ఇకనైనా తమ గ్రామాన్ని దర్శించి తమకు నీటి ఎద్దడి లేకుండా,తమ దాహార్తిని తీర్చాలని ప్రజలు తెలియజేస్తున్నారు

## నిబంధనలు పాటించండి.. సురక్షితంగా వెళ్లండి..!

- వేముల మండల ఎస్.ఐ పి.ప్రవీణ్ కుమార్
- బెస్తవారిపల్లె క్రాస్‌రోడ్డులో పోలీసుల తనిఖీలు
- నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలకు చలానాలు



**వేముల మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**రహదారి భద్రతకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షితంగా ప్రయాణించాలని వేముల మండల ఎస్ఐ పి.ప్రవీణ్‌కుమార్ సూచించారు.వేముల మండల పరిధిలోని బెస్తవారిపల్లె క్రాస్‌రోడ్డులో గురువారం సాయంత్రం ఎస్.ఐ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు.ప్రధాన రహదారిపై రాకపోకలు సాగిస్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను ఆపి క్షుణ్ణంగా తనిఖీ చేశారు.వాహనదారుల డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్, బీమా తదితర ధ్రువపత్రాలను పరిశీలించారు.నిబంధనలకు విరుద్ధంగా ఉన్న వాహనాలను గుర్తించి,ఆయా వాహనదారులకు చలానాలు విధించారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలకు సంబంధించిన అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలని ఎస్ఐ సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం,అతివేగంగా ప్రయాణించడం,సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని తెలిపారు.**రోడ్డు భద్రతపై అవగాహన** చిన్నపాటి నిర్లక్ష్యం,అజాగ్రత్త కారణంగా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్ఐ పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించడంతో పాటు విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని వాహనదారులకు అవగాహన కల్పించారు. **తనిఖీలు నిరంతరం కొనసాగుతాయి** మండల పరిధిలో రహదారి భద్రతను దృష్టిలో ఉంచుకుని వాహన తనిఖీలను నిరంతరం కొనసాగిస్తామని ఎస్ఐ పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు.నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.వాహనదారులు పోలీసులకు సహకరించి ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ సురక్షిత ప్రయాణానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.

## దేవుని కడప నాలుగు బ్రిడ్జిల పరిశీలన

- రూ.8 కోట్లకు పైగా వ్యయంతో రహదారి అభివృద్ధికి చర్యలు
- టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, కమిషనర్ భవాని ప్రసాద్



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని దేవుని కడప రహదారి అభివృద్ధికి చర్యలు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహించారు. దేవుని కడప చెరువు వద్ద ఉన్న నాలుగు బ్రిడ్జిలను తెలుగుదేశం పార్టీ కోఆర్డినేటర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భవాని ప్రసాద్, ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి గురువారం పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా సర్కిల్ నుంచి దేవుని కడప రింగురోడ్డు వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణానికి ఎన్నో ఏళ్లుగా ప్రతిపాదనలు ఉన్నప్పటికీ ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ప్రస్తుతం కృష్ణా సర్కిల్ నుంచి పెట్రోల్ బంక్ వరకు రహదారి అభివృద్ధి జరిగిందని, అక్కడి నుంచి దేవుని కడప వైపు రహదారిని కొనసాగించేందుకు నాలుగు బ్రిడ్జిల నిర్మాణం అవసరమని తెలిపారు.ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారులతో కలిసి బ్రిడ్జిల నిర్మాణానికి అవసరమైన చర్యలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. రూ.8 కోట్లకు పైగా వ్యయంతో రహదారిని అత్యంత సుందరంగా అభివృద్ధి చేసేందుకు పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ఈ రహదారి పూర్తయితే దేవుని కడప ప్రాంత ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కూడా తగ్గే అవకాశం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ వీర హౌస్ డెవలప్‌మెంట్ చైర్మన్ మురికినాటి శ్రీధర్, ఏ. మునిస్వామి, ఎం. బాలకృష్ణ, వెంకట సిసింద్రీ, దేవుని కడప ప్రాంత ప్రజలు, టీడీపీ కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రతిభకు గుర్తింపు..

- టెన్నిస్ బాల్ క్రికెట్‌లో

### సత్తా చాటి ఆంధ్ర టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్‌కు ఎంపిక





**వీరబల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**వీరబల్లి మండలం వంగిమల్ల కస్పాకు చెందిన తోపిక్ ఆలీఖాన్ ఆంధ్ర టెన్నిస్ బాల్ ప్రీమియర్ లీగ్ క్రికెట్‌లో ప్రతిభ కనబరిచి వేలం ద్వారా గోదావరి స్ట్రైకర్స్ జట్టుకు ఎంపిక కావడం అభినందనీయమని విఆర్డిఎస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి అన్నారు.స్థానిక ఎస్డీకేఆర్ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న తోపిక్ ఆలీఖాన్‌ను గురువారం కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, తోటి విద్యార్థులు శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ..తమ విద్యార్థి చదువుతో పాటు క్రికెట్‌లోనూ రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వకారణమన్నారు. క్రికెట్‌లో రాణించాలనే లక్ష్యాన్ని సాధించాలంటే పట్టుదల, క్రమశిక్షణ, నిరంతర సాధన ఎంతో అవసరమని తెలిపారు.విఆర్డిఎస్ అధ్యక్షుడు సురేంద్రారెడ్డి మాట్లాడుతూ..టెన్నిస్ బాల్ క్రికెట్‌ను సాధారణంగా గల్లీలకే పరిమితమైన క్రీడగా భావించేవారని, అయితే ప్రీమియర్ లీగ్ వంటి వేదికల ద్వారా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన క్రీడాకారులకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం హర్షణీయమన్నారు. తోపిక్ ఆలీఖాన్ మరింత ఉన్నత స్థాయికి ఎదిగి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో కళాశాల సిబ్బంది నాగయ్య, వెంకటరమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## అహోబిలం ఇస్కాన్ ఆలయంలో వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



**ఆళ్లగడ్డ మన జనప్రగతి సెప్టెంబర్ 03:-**అహోబిలం రోడ్డులోని హరినగరం వద్ద వెలసిన ఇస్కాన్ ఆలయంలో శుక్రవారం శ్రీకృష్ణ జన్మాష్టమి పర్వదిన వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం అహోబిలం నిర్వాహకులు చంద్ర కేశవ దాస్ ప్రభు తెలిపారు.గురువారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా శ్రీకృష్ణ భగవానుడి జన్మదిన వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 4 గంటల నుంచే స్వామివారికి అభిషేకం, వివిధ రకాల రాజభోగ సేవలు, హారతులు నిర్వహిస్తామని చెప్పారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా అర్ధరాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు వెల్లడించారు.వేడుకలకు భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై శ్రీకృష్ణుని ఆశీస్సులు పొందాలని ఆయన కోరారు. ఆలయానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు చంద్ర కేశవ దాస్ ప్రభు తెలిపారు.

# వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, భోజన నాణ్యతపై రాజీ పడొద్దు: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.

**కర్నూలు బ్యూరో మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో పారిశుద్ధ్యం, విద్యార్థులకు అందించే భోజనం నాణ్యత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అన్ని సంక్షేమ విభాగాల ప్రిన్సిపాల్స్/వార్డెన్‌లను హెచ్చరించారు.గురువారం కలెక్టరేట్ లోని సునయన ఆడిటోరియంలో సంక్షేమ శాఖలకు సంబంధించిన పురోగతి పై అన్ని సంక్షేమ విభాగాల ప్రిన్సిపాల్స్/వార్డెన్‌లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలను తరచుగా తనిఖీ చేస్తానని, తనిఖీల సమయంలో లోపాలు కనిపిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.వసతి గృహాల వార్డెన్లు, కుక్‌లు, పారిశుద్ధ్య సిబ్బందికి ప్రతి నెలా సెన్సిటైజేషన్ కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు.వసతి గృహాలలో టాయిలెట్లు, గదులు మరియు హాస్టల్ ప్రాంగణం శుభ్రంగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు ఆరోగ్యకరమైన, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత వార్డెన్లు, సిబ్బందిపై ఉందన్నారు..విద్యార్థులు తమ తల్లిదండ్రులను విడిచి ప్రభుత్వ హాస్టళ్లలో ఉంటున్నందున, వారికి తల్లిదండ్రుల లాగా సంరక్షణ, ఆప్యాయత అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎమ్ఈఓ లు, ఎంపిడిఓ లు, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ అధికారులు, ఇతర సంబంధిత



అధికారులు తమ పరిధిలోని పాఠశాలలు, హాస్టళ్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలన్నారు.విద్యార్థుల విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచాలన్నారు. ఈ విద్యా సంవత్సరంలో గతంతో పోలిస్తే పాస్ శాతాన్ని కనీసం 15 శాతానికి మించి పెంచేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అన్ని సంక్షేమ హాస్టళ్లలో తాగునీటి నాణ్యతపై నిరంతరం పరీక్షలు నిర్వహించాలన్నారు. వసతి గృహాల్లో అవసరమైన మరమ్మతులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మంజూరు చేసిన నిధులు సక్రమంగా వినియోగించుకోవడంతో పాటు, పనులు నాణ్యతతో జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.అన్నం సక్రమంగా ఉడికించడంతో పాటు సరిపడా పరిమాణంలో భోజనం అందుచేయాలన్నారు. భోజనానికి సంబంధించిన బిల్లులు, ఖర్చులు, విద్యార్థులకు అందిస్తున్న భోజన పరిమాణం, నాణ్యతను సరిపోల్చి పరిశీలిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. నాసిరకం భోజనం అందిస్తూ బిల్లులు పొందుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. వార్డెన్లు, సంబంధిత సిబ్బంది తమకు కేటాయించిన హెడ్‌క్వార్టర్స్‌లో నివాసం ఉండేలా చూడాలని కలెక్టర్ వార్డెన్ లను ఆదేశించారు. హాస్టళ్లలో సోక్‌పిట్లు, రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు, ప్లాంటేషన్ పనులలో పురోగతి తీసుకొని రావాలన్నారు. పెండింగ్ పనులన్నింటినీ సెప్టెంబర్ నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ వార్డెన్ లను ఆదేశించారు.సమావేశంలో డ్వామా పిడి నరసింహ రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి ప్రసూన, ట్రైబల్ వెల్ఫేర్ అధికారి సురేష్, వార్డెన్ లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# జిమ్ ట్రైనర్ హత్య కేసులో నలుగురి అరెస్టు

**- మార్ఫింగ్ ఫొటోలే హత్యకు కారణం: అదనపు ఎస్పీ కిషోర్‌కుమార్ వెల్లడి**

**కాకినాడ మన జనప్రగతి సెప్టెంబరు 03:**–కాకినాడ భానుగుడి సెంటర్‌లో జిమ్ ట్రైనర్ కొడమాటి సతీష్‌రెడ్డి హత్య కేసును పోలీసులు ఛేదించారు.ఈ కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు కాకినాడ జిల్లా అదనపు ఎస్పీ, కాకినాడ ఇన్‌చార్జి ఎస్‌డీపీవో డాక్టర్ మహంతి కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం కాకినాడ డివిజనల్ పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను వెల్లడించారు.కాకినాడ రామకృష్ణారావుపేటకు చెందిన సతీష్‌రెడ్డి ఆగస్టు 26న తెల్లవారుజామున 2 గంటల సమయంలో భానుగుడి సెంటర్‌లోని చార్మినార్ టీ సెంటర్ వద్ద హత్యకు గురయ్యాడు. మృతుడి స్నేహితుడైన బొందల సాయికిరణ్‌తో పాటు ఇంటి సత్యనారాయణ, ప్రయాగ దుర్గాప్రసాద్, ఇంటి ఆదికృష్ణ కలిసి సతీష్‌రెడ్డిపై దాడి చేసినట్లు దర్యాప్తులో తేలింది. మొదట కాళ్లతో తన్నడంతో పాటు చెక్కబద్దతో తల, ముఖం, శరీరంపై దాడి చేశారు. చెక్కబద్ద విరిగిపోవడంతో దాని పదునైన ముక్కతో సాయికిరణ్ సతీష్‌రెడ్డి గొంతులో పలుమార్లు



పొడిచినట్లు పోలీసులు తెలిపారు. **మార్ఫింగ్ ఫొటోలపై విభేదాలు** ప్రధాన నిందితుడు సాయికిరణ్‌కు ప్రేమ వ్యవహారానికి సంబంధించి సతీష్‌రెడ్డితో విభేదాలు ఏర్పడ్డాయని పోలీసులు తెలిపారు. సాయికిరణ్ మరో యువతితో ఉన్నట్లుగా సతీష్‌రెడ్డి మార్ఫింగ్ చేసిన ఫొటోలను అతని ప్రియురాలికి పంపడంతో ఇద్దరి మధ్య వివాదం తలెత్తినట్లు విచారణలో వెల్లడైంద న్నారు. సతీష్‌రెడ్డి తనను చంపుతానని బెదిరించడంతో, అతను బతికి ఉంటే తనకు ప్రాణహాని ఉంటుందనే ఉద్దేశంతో హత్యకు పాల్పడినట్లు సాయికిరణ్ విచారణలో వెల్లడించినట్లు తెలిపారు. **రైల్వే స్టేషన్ వద్ద అరెస్టు** మృతుడి అన్న కొడమాటి యర్రయ్యరెడ్డి ఫిర్యాదు మేరకు కాకినాడ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో క్రైం నంబర్ 135/2026 కింద బీఎన్ఎస్ సెక్షన్ 103(1) రెడ్‌విత్ 3(5) ప్రకారం కేసు నమోదు చేశారు. నిందితులు నేరం అనంతరం పరారయ్యారు. దుర్గాప్రసాద్ తన బుల్లెట్ మోటార్‌సైకిల్ (AP 05 DN 8800)ను కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు.టూటౌన్ సీఐ మజ్జి అప్పలనాయుడు ఆధ్వర్యంలో ఎస్సైలు సువర్ణకుమారి,ఎల్ భీష్మకుమార్, పి.సత్తిబాబు,పోలీసు,క్రైమ్ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. విశ్వసనీయ సమాచారంతో రైల్వే స్టేషన్ పార్కింగ్ వద్ద పోలీసులు మాటువేసి ఉండగా, బుధవారం సాయంత్రం బుల్లెట్‌ను తీసుకునేందుకు వచ్చిన నలుగురిని అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో బొందల సాయికిరణ్ (30), ఇంటి సత్యనారాయణ (30), ప్రయాగ దుర్గాప్రసాద్ (28), ఇంటి ఆదికృష్ణ (30) ఉన్నారు. వారి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, బుల్లెట్ మోటార్‌సైకిల్, ఘటన సమయంలో ధరించిన దుస్తులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను న్యాయస్థానం ముందు హాజరుపరిచి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించనున్నట్లు అదనపు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ బిందుమాధవ్ అభినందించారు.

# ఆధునిక సౌకర్యాలతో ప్రొద్దుటూరు ఎస్‌డీపీఓ కార్యాలయం పునరుద్ధరణ

**ప్రొద్దుటూరు స్టాఫ్ రిపోర్టర్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–పోలీస్ అధికారులు, సిబ్బందికి మెరుగైన పని వాతావరణం కల్పించడంతో పాటు, సమస్యల పరిష్కారం కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించాలనే లక్ష్యంతో ఆధునిక హంగులతో పునరుద్ధరించిన ప్రొద్దుటూరు సబ్–డివిజనల్ పోలీస్ ఆఫీసర్ కార్యాలయాన్ని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపీఎస్ గురువారం ప్రారంభించారు. మధ్యాహ్నం 12.30 గంటలకు జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె. ప్రకాష్ బాబు, ప్రొద్దుటూరు ఏఎస్పీ యు. విబు కృష్ణ, ఐపీఎస్‌తో పాటు ప్రొద్దుటూరు సబ్–డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్ఐలు,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.పోలీస్ శాఖలో మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడంలో భాగంగా ఎస్‌డీపీఓ కార్యాలయాన్ని ఆధునిక సౌకర్యాలతో పునరుద్ధరించారు.అధికారులు, సిబ్బంది విధులను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు అనువైన వాతావరణంతో పాటు, పోలీస్ సేవల కోసం వచ్చే ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడమే పునరుద్ధరణ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.దాతల సహకారం అభినందనీయమని ఎస్ డి పి ఒ కార్యాలయ పునరుద్ధరణకు ప్రొద్దుటూరులోని



స్వరూప్ ఐ హాస్పిటల్స్‌కు చెందిన డాక్టర్ వై.వి. స్వరూప్ కుమార్ రెడ్డి ప్రధానంగా ఆర్థిక సహకారం అందించారు.పోలీస్ శాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఆయన అందించిన సహకారాన్ని జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.అదేవిధంగా వి. జయచంద్ర రెడ్డి, డాక్టర్ కె.వి.ఆర్.ప్రదీప్ రెడ్డి, డాక్టర్ ఎన్. నాగార్జున యాదవ్,దండపాణి శ్రీనివాసకుమార్, నాగూర్ బాషా, ఎస్. నాగిరెడ్డి, చెన్న శ్రీనివాసులు,కె.గంగిరెడ్డి,పి.మహేశ్వర్ రెడ్డి, పి.రాజేష్ రెడ్డి,ఎం.శంకర్ రెడ్డి తదితరులు కూడా కార్యాలయ పునరుద్ధరణకు ఆర్థిక సహకారం అందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ శాఖ మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రజలు, ప్రముఖులు, దాతలు, శ్రేయోభిలాషులు అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమన్నారు.సమాజంలోని వివిధ వర్గాల సహకారంతో పోలీసులకు మెరుగైన పని పరిస్థితులు కల్పించడంతో పాటు, ప్రజలకు మరింత సమర్థవంతమైన, నాణ్యమైన పోలీస్ సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందని తెలిపారు.ప్రధాన దాత డాక్టర్ వై.వి. స్వరూప్ కుమార్ రెడ్డితో పాటు కార్యాలయ పునరుద్ధరణకు సహకరించిన ఇతర దాతలు, శ్రేయోభిలాషులకు పోలీస్ శాఖ తరఫున ఎస్పీ కృతజ్ఞతలు తెలిపారు.ఏఎస్పీ చొరవతో ఆధునిక రూపుప్రొద్దుటూరు ఏఎస్పీ యు. విబు కృష్ణ, ఐపీఎస్ చొరవతో కార్యాలయ పునరుద్ధరణ పనులు చేపట్టారు. దాతలు, పోలీస్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో కార్యాలయ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసి ఆధునిక రూపాన్ని కల్పించారు.ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించేందుకు అవసరమైన సౌకర్యాల కల్పనలో ప్రజా భాగస్వామ్యం ఎంతో దోహదపడుతుందని పోలీస్ అధికారులు పేర్కొన్నారు. కార్యాలయ పునరుద్ధరణకు సహకరించిన ప్రధాన దాత డాక్టర్ వై.వి. స్వరూప్ కుమార్ రెడ్డితో పాటు ఇతర దాతలు, శ్రేయోభిలాషులకు పోలీస్ శాఖ తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సర్టిఫికెట్ పరీక్షలను తనిఖీ చేసిన వైవీయూ సీఈ



**కడప మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–యోగి వేమన విశ్వవిద్యాలయంలో గురువారం నుంచి ఫైన్ ఆర్ట్స్ విభాగం ఆధ్వర్యంలో కూచిపూడి, కీబోర్డు, కర్ణాటక సంగీతం సర్టిఫికెట్ పరీక్షలు, డిగ్రీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభమయ్యాయి.ఈ సందర్భంగా పరీక్షా కేంద్రాలను విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ టి. లక్ష్మీప్రసాద్, ప్రధాన పరీక్షల పర్యవేక్షకుడు ప్రొఫెసర్ రెడ్డయ్య తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణలో తీసుకుంటున్న భద్రతా చర్యలు, నిబంధనల అమలు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు.పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేలా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో ఫైన్ ఆర్ట్స్ విభాగాధిపతి డాక్టర్ కోటా మృత్యుంజయరావు పాల్గొన్నారు.

# సాయిబాబా ఆలయంలో ఘనంగా అన్నదానం



**వీరబల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–వీరబల్లి మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో శ్రావణ గురువారం సందర్భంగా గురువారం భక్తులు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.హైదరాబాద్‌కు చెందిన ఎమ్మార్ మోహన్ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. సాయిబాబాకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.అన్నదాన కార్యక్రమాన్ని స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, ఎంపీపీ గాలి వీటి రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రారంభించారు. అనంతరం భక్తులు, ప్రజలకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు కొళాయి రెడ్డి, వీఆర్డీఎస్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి, భక్తులు, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమం సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది.

# గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్లో అట్టహాసంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలు



**నంద్యాల, మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–నంద్యాల జిల్లా బాబా నగర్ సమీపంలోని శ్రీ గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్లో పట్టాహాసంగా ముందస్తు కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. కృష్ణాష్టమి వేడుకలకు ముందుగా శ్రీకృష్ణుని విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురురాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ పెద్దిరెడ్డి షేక్షావలి రెడ్డి ఆధ్వర్యంలో అట్టహాసంగా ఆనందోత్సవాల మధ్య సాంప్రదాయ బద్ధంగా కృష్ణాష్టమి వేడుకలను నిర్వహించారు. వేడుకల్లో ఉట్టి మహోత్సవం ఆనందభరితంగా సాగింది. చిన్నారులు శ్రీకృష్ణుడు గోపికల వేషధారణలతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వేడుకల్లో భాగంగా చిన్నారులు శ్రీకృష్ణ నాటకాన్ని ప్రదర్శించగా అందరిని ఆకట్టుకుంది. నాటకంలోని ప్రతి అంశం ప్రదర్శించిన సమయంలో పిల్లలు కేరింతలు కొడుతూ వీక్షించారు. అనంతరం శ్రీ గురు రాజా ఇంటర్నేషనల్ స్కూల్ డైరెక్టర్ షేక్షావలి రెడ్డి కృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలియజేశారు.

# నంద్యాలలో సెప్టెంబర్ ఆరో తేదీ ఉచిత కృత్రిమ కాలు అందజేత కార్యక్రమం

**నంద్యాల, మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–నంద్యాల ఆయుష్ యోగ కేంద్రంలో ఈ నెల ఆరవ తేదీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు భారత్ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో నంద్యాలలో ప్రత్యేకంగా 50వేల రూపాయలు విలువ చేసే ఉచిత కృత్రిమ కాలు అందజేత కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఆనంద్ గురూజీ తెలిపారు.ప్రమాదాలు, అనారోగ్య సమస్యలు లేదా ఇతర కారణాలతో కాళ్లు కోల్పోయి ఇబ్బందులు పడుతున్న వారికి ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా కృత్రిమ కాళ్లు అందజేయనున్నారు. షేర్ సొసైటీ సహకారం మరియు పబ్బు బాలచంద్రుడు కుమారుడు డాక్టర్ పబ్బు చిరంజీవి చేయూతతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు అర్హులైన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరారు.ఈ కార్యక్రమంలో భాగంగా ₹50,000 రూపాయల విలువైన కృత్రిమ కాలు ఉచితంగా అందజేయబడుతుందని తెలిపారు. అలాగే, 30 మందికి పరిమితంగా ఈ సేవ అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.కార్యక్రమ వివరాలుతేదీ: 06-09-2026, ఆదివారంసమయం: ఉదయం 9.00 గంటల నుంచికార్యక్రమ స్థలం: ఆయుష్ యోగా కేంద్రం, మున్సిపల్ పార్క్ లోపల టౌన్ హాల్ ప్రక్కన,నంద్యాల జిల్లా 518501.అర్హత ఉన్న వారు ముందుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు. చిన్నారులు, కుటుంబ సభ్యులు మరియు నడవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న దివ్యాంగులకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు.సంప్రదించవలసిన ఫోన్ నంబర్లుభండే ఆనంద్ గురూజీ: 9989983673కె.ఎస్.ఆర్. ఆంజనేయులు సేవ గౌరవం చలనం కొత్త జీవితం అనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు.

# కూల్చినా..మళ్లీ కట్టేస్తున్నారు!

**వివేక్ నగర్ లోని**
**బఫర్ జోన్‌లో జీరో పర్మిషన్ సైట్**
**టౌన్ ప్లానింగ్ చర్యలకు**
**అక్రమ నిర్మాణదారుల సవాల్**
**కొంత భాగం కూల్చిన**
**తర్వాత కూడా యథేచ్ఛగా నిర్మాణం**
**అధికారుల నిఘా ఎక్కడ..? మళ్లీ నిర్మాణం**
**సాగుతున్నా పట్టించుకోరా..?**

**కూకట్‌పల్లి మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకున్నా... ఆ చర్యలు తాత్కాలికంగానే మిగిలిపోతున్నాయా? అధికారులు కొన్ని అంతస్తులను కూల్చివేసిన తర్వాత కూడా అదే భవనంలో మళ్లీ నిర్మాణ పనులు యథేచ్ఛగా కొనసాగుతుండటం అనేక అనుమానాలకు తావిస్తోంది. బాలాజీ నగర్ డివిజన్ పరిధిలోని వివేక్ నగర్ బఫర్ జోన్ లో నిర్మిస్తున్న నిర్మాణంపై గతంలో వచ్చిన ఫిర్యాదులు, అధికారుల పరిశీలన, జారీ చేసిన నోటీసులు, తీసుకున్న చర్యల నేపథ్యంలో కొంత మేర నిర్మాణాన్ని తొలగించారు. అయితే తాజాగా మళ్లీ అదే భవనంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో “అక్రమ నిర్మాణాన్ని కూల్చారా? లేక కేవలం చూపించడానికి చర్యలు తీసుకున్నారా?” అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.


**కూల్చిన చోటే మళ్లీ నిర్మాణం ఎలా?** అక్రమ నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకున్న తర్వాత కూడా నిర్మాణదారుడు తిరిగి పనులు ప్రారంభిస్తే, సంబంధిత అధికారులు వెంటనే స్పందించాల్సి ఉంటుంది. నిర్మాణాన్ని నిలిపివేయడంతో పాటు, నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టాల్సి ఉంటుంది. కానీ ఇక్కడ పరిస్థితి అందుకు భిన్నంగా కనిపిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. ఒకవైపు అధికారులు అక్రమ నిర్మాణాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నామని చెబుతుండగా, మరోవైపు ఇప్పటికే చర్యలు ఎదుర్కొన్న నిర్మాణంలోనే తిరిగి పనులు జరుగుతున్నాయనే ఆరోపణలు రావడం టౌన్ ప్లానింగ్ పర్యవేక్షణపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**చర్యలు కాగితాలకే పరిమితమా..?** కూకట్‌పల్లి జోన్‌లో భారీ సంఖ్యలో అనధికార నిర్మాణాలను గుర్తించి చర్యలు ప్రారంభించినట్లు తాజాగా అధికారులు వెల్లడించారు. గత ఏడాదిలో కూకట్‌పల్లి జోన్‌లోనే 365 అనధికార నిర్మాణాలను గుర్తించినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.అంతేకాకుండా, ఇటీవల కూకట్‌పల్లి జోన్‌లో రెండు అనధికార నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు ప్రకటించారు. అక్రమ నిర్మాణాలను ప్రారంభ దశలోనే గుర్తించి చర్యలు తీసుకుంటామని కూడా స్పష్టం చేశారు.అయితే ఇప్పటికే అధికారుల చర్యలకు గురైన భవనంలోనే మళ్లీ నిర్మాణం కొనసాగుతున్నట్లయితే... అది అధికారుల ఆదేశాలను బేఖాతరు చేయడమా? లేక అధికారుల పర్యవేక్షణ లోపమా? అన్నది తేలాల్సి ఉంది.

**మళ్లీ నిర్మాణం వెనుక ఎవరి అండ?** అధికారులు ఒకసారి అక్రమ నిర్మాణాన్ని గుర్తించి చర్యలు తీసుకున్న తర్వాత కూడా నిర్మాణదారుడు అదే ప్రదేశంలో తిరిగి పనులు ప్రారంభించడానికి కారణమేంటి? స్థానికంగా అధికారుల నుంచి ఎలాంటి అడ్డంకులు లేవన్న ధైర్యంతోనే పనులు కొనసాగిస్తున్నారా? లేక నిర్మాణదారుడికి ఎవరి అండదండలు ఉన్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.అధికారుల అనుమతి లేకుండా నిర్మాణం కొనసాగుతున్నట్లయితే వెంటనే పనులు నిలిపివేసి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది?** అక్రమంగా అదనపు అంతస్తులు, సెల్లార్లు లేదా నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టడం కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు.. ప్రజల భద్రతకు కూడా ముప్పుగా మారే అవకాశం ఉంది. ఇటీవల నగర పరిధిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు మరింత వేగవంతం కావడానికి భవన ప్రమాదాలు కూడా కారణమయ్యాయి.అందుకే “చర్యలు తీసుకున్నాం” అని చెప్పడం కాకుండా.. చర్యల తర్వాత కూడా నిర్మాణం కొనసాగుతోందా లేదా అన్నది అధికారులు నిరంతరం పర్యవేక్షించాల్సిన అవసరం ఉంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి** ఇప్పటికే చర్యలు తీసుకున్న భవనంలో తిరిగి నిర్మాణం ఎలా కొనసాగుతోంది? నిర్మాణదారుడికి ఎవరు అనుమతి ఇచ్చారు? ఏదైనా కొత్త అనుమతి పొందారా? లేక పాత అనుమతుల ఆధారంగా అదనపు నిర్మాణం చేపడుతున్నారా? అధికారులు స్వయంగా పరిశీలించి వాస్తవాలను వెల్లడించాలి.ఒకసారి కూల్చిన అక్రమ నిర్మాణం మళ్లీ తలెత్తితే.. అది కేవలం నిర్మాణదారుడి ధైర్యానికి నిదర్శనం కాదు; అధికారుల పర్యవేక్షణ వ్యవస్థలోని లోపాలకు కూడా అద్దం పడుతుంది.కాబట్టి సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారులు వెంటనే స్థలాన్ని పరిశీలించి, ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణం చట్టబద్ధమైనదా? అనుమతులకు అనుగుణంగానే ఉందా? గతంలో కూల్చివేతకు గురైన భాగాలేనా మళ్లీ నిర్మిస్తున్నది? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




## శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి ముందస్తు వేడుకలు



**వేంపల్లె మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–వేంపల్లె లోని శ్రీ చైతన్య హైస్కూల్‌లో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి ముందస్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు రాధాకృష్ణుల వేషధారణలో పాల్గొని వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.విద్యార్థులు శ్రీకృష్ణుని బాల్య లీలలు,భక్తి ధర్మానికి సంబంధించిన సందేశాలను ప్రతిబింబించేలా నృత్యాలు, నాటికలు మరియు ప్రసంగాలు ప్రదర్శించారు.విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి.అనంతరం సంప్రదాయబద్ధంగా ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని నిర్వహించగా,విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను మరింత సందడిగా మార్చారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ బండ్రెడ్డి చక్రపాణి రెడ్డి మాట్లాడుతూ...శ్రీకృష్ణుడి జీవితం ప్రతి ఒక్కరికీ ధైర్యం,ధర్మం,కర్తవ్యనిష్ఠ, సత్య మార్గంలో నడవడానికి స్ఫూర్తినిస్తుందన్నారు.విద్యార్థులు పండుగల ప్రాముఖ్యతను తెలుసుకోవడంతో పాటు మన సంస్కృతి,సంప్రదాయాలను గౌరవించాలని సూచించారు.అదేవిధంగా పాఠశాల ఉపాధ్యాయులు కూడా శ్రీకృష్ణ జన్మాష్టమి విశిష్టతను,శ్రీకృష్ణుడి బోధనలను విద్యార్థులకు వివరించారు.విద్యార్థుల ప్రతిభను అభినందిస్తూ ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు వారిలో సృజనాత్మకత,ఆత్మవిశ్వాసం ఐక్యతను పెంపొందిస్తాయని పేర్కొన్నారు.రాధాకృష్ణుల వేషధారణలో చిన్నారులు,విద్యార్థుల నృత్యాలు,నాటికలు,ప్రసంగాలు,ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాఠశాల ప్రాంగణం శ్రీకృష్ణ నామస్మరణతో,ఆనందోత్సాహాలతో కళకళలాడింది.

## బండి పరిమళ జ్యోతికి ఘన సన్మానం

**• రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారంతో సత్కారం**



**పోరుమామిళ్ల/కాశినాయన మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–కాశినాయన మండలంలోని రెడ్డికొట్టాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న బండి పరిమళ జ్యోతిని రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారంతో ఘనంగా సన్మానించారు. 17 సంవత్సరాలుగా విద్యార్థుల అభ్యున్నతికి ఆమె అందిస్తున్న సేవలను, వినూత్న బోధనా పద్ధతులను గుర్తించి ఈ పురస్కారంతో సత్కరించారు.విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు బోధనా అభ్యసన సామగ్రి, ఎలక్ట్రానిక్ వీడియో పరికరాలు, ట్యాబ్‌లు, డిజిటల్ విద్యా కార్యక్రమాలను వినియోగించడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ పరిమళ జ్యోతి చురుకుగా పాల్గొంటున్నారు. ఆమె సేవలను గుర్తించిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి ఫౌండేషన్‌కు చెందిన బి.ఎస్. నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి నిర్మల, రాష్ట్రపతి అవార్డు గ్రహీత దాదా పీర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఖదీర్ భాష, ఉపాధ్యాయులు పాల్గొని పరిమళ జ్యోతిని ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎంఈఓ నిర్మల మాట్లాడుతూ కాశినాయన మండలంలో పరిమళ జ్యోతి వంటి ప్రతిభావంతమైన ఉపాధ్యాయురాలు ఉండటం మండలానికి గర్వకారణమని అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ఆమె చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బి.ఎస్. నారాయణరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులను ఉత్తమ భావి పౌరులుగా తీర్చిదిద్దే శిల్పులు ఉపాధ్యాయులేనని అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా పరిమళ జ్యోతికి రాష్ట్ర ఉత్తమ గురుబ్రహ్మ పురస్కారం అందజేయడం సంతోషకరమన్నారు.కార్యక్రమంలో విద్యార్థిని వహీదా ఉపాధ్యాయుల గొప్పతనాన్ని వివరిస్తూ పాట పాడి అలరించింది. మరో విద్యార్థిని రషీదా భరతనాట్య ప్రదర్శనతో ఆకట్టుకుంది. ఉపాధ్యాయులు మహేష్ కుమార్, సురేష్, వెంకటసుబ్బయ్య, సావిత్రి, విజయలక్ష్మి, శ్రీలత, భాష, దేవరాజుతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## టీడీపీ సీనియర్ నాయకుడు యగ్గడి మునిస్వామికి ఘన నివాళి

**- టీడీపీ జెండాతో అంతిమ నివాళులు అర్పించిన మండల నాయకులు**



**బొమ్మనహాల్ మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–మండల పరిధిలోని గోవిందవాడ గ్రామ ఆర్డీటీ కాలనీకి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు యగ్గడి మునిస్వామి హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు,ఆయన మృతి విషయం తెలుసుకున్న టీడీపీ మండల నాయకులు,కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున గోవిందవాడకు చేరుకుని మునిస్వామి భౌతికకాయానికి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా మండల నాయకులు కొత్తపల్లి మల్లికార్జున,మండల కన్వీనర్ కే.మల్లన్న,కొత్తపల్లి మహేంద్ర, హొన్నూరు మాజీ సర్పంచ్ కేసప్ప,నాయకులు సోమనాథ్ గౌడ్,మాజీ ఎంపీటీసీ కావలి వేమన్న,ఎస్.జి.వన్నురుస్వామి,కట్టంలి సుంకన్న,చెవుల వన్నురుస్వామి,హొన్నూరు హెచ్. ఆనంద్,మల్లిడు సీనా,సంగప్ప,గాలి బసప్ప,సైకిల్ షాప్ హనుమంతు,వి.ఎల్.రామాంజనేయులు, నాగరాజు మరియు అభిమాన నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున కలసి మునిస్వామి భౌతికకాయానికి పూలమాలలు వేసి,తెలుగుదేశం పార్టీ జెండాను కప్పి అంతిమ నివాళులు అర్పించారు,అనంతరం మండల సీనియర్ నాయకులు కొత్తపల్లి మల్లికార్జున మాట్లాడుతూ..యగ్గడి మునిస్వామి మృతి పార్టీకి తీరని లోటని అన్నారు, తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ఆయన ఎన్నో ఏళ్లుగా చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు,పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన మునిస్వామి సేవలను ఎప్పటికీ గుర్తుంచుకుంటామని తెలిపారు, అనంతరం మునిస్వామి కుటుంబ సభ్యులను పరామర్శించారు,కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు.ధైర్యంగా ఉండాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,కుటుంబ సభ్యులు,బంధుమిత్రులు పాల్గొని నివాళులు అర్పించారు.

## గురప్ప స్వామి దేవస్థానంలో పోటాపోటీగా వేలం పాటలు

**గతేడాదితో పోలిస్తే భారీగా పెరిగిన వేలం ధరలు..**

**కొబ్బరి చిప్పల వేలంలో సంచలనం**



**పోరుమామిళ్ల మన జనప్రగతి సెప్టెంబర్ 03:**–పోరుమామిళ్లలోని శ్రీశ్రీ మద్దిమాను గురప్ప స్వామి దేవస్థానంలో వివిధ వ్యాపారాలు, సేవలకు సంబంధించిన వేలం పాటలు గురువారం ఎండోమెంట్ అధికారుల ఆధ్వర్యంలో ఉత్కంఠభరితంగా జరిగాయి.తలనీలాలు,టెంకాయలు, కూల్‌డ్రింక్స్ దుకాణం, సప్లయర్స్, కొబ్బరి చిప్పలు, పూలు, నిమ్మకాయలు, దేవుని భూమి సాగు తదితర హక్కులకు వేలం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బద్వేల్ నియోజకవర్గ టీడీపీ యువ నాయకులు చెరుకూరి రవికుమార్ నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యనమల సుధాకర్ హాజరై వేలం పాటలను ముందుకు నడిపించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి పలు వేలం పాటల ధరలు గణనీయంగా పెరగడం విశేషంగా నిలిచింది. ముఖ్యంగా కొబ్బరి చిప్పల సేకరణ హక్కు ఏకంగా వంద శాతం పెరగడంతో వేలం ప్రత్యేక ఆకర్షణగా మారింది.టెంకాయల విక్రయ హక్కును జి. నాగేంద్ర రూ.4.55 లక్షలకు దక్కించుకున్నారు. చిల్లర అంగళ్ల నిర్వహణ హక్కును పి. బాలకృష్ణ రూ.5.03 లక్షలకు కైవసం చేసుకున్నారు. కూల్‌డ్రింక్స్ దుకాణాన్ని కూడా పి. బాలకృష్ణ రూ.3.15 లక్షలకు దక్కించుకున్నారు. శామియానాలు, వంట పాత్రలు, కుర్చీలు తదితర సామగ్రికి సంబంధించిన సప్లయర్స్ హక్కును పి. బాలకృష్ణ రూ.6 లక్షలకు దక్కించుకున్నారు.

కొబ్బరి చిప్పల సేకరణ హక్కును కవలకుంట్ల వెంకట సుబ్బయ్య రూ.1.04 లక్షలకు దక్కించుకోవడం సంచలనంగా మారింది. గతేడాది కొబ్బరి చిప్పల వేలం రూ.43 వేల వద్ద ముగియగా, ఈసారి రూ.1.04 లక్షలకు చేరుకోవడంతో పలువురు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దేవస్థానం భూమిని సాగు చేసుకునే హక్కును కల్వకూరి వెంకట సుబ్బయ్య రూ.15 వేలకు, పూల దండలు, నిమ్మకాయల హక్కును చిన్న వెంకట సుబ్బయ్య రూ.11 వేలకు దక్కించుకున్నారు.మొత్తంగా అన్ని వేలం పాటలు పోటాపోటీగా సాగి ఉత్కంఠను రేకెత్తించాయి. అయితే తలనీలాల వేలానికి సరైన ధర రాకపోవడంతో ఆ వేలాన్ని అధికారులు వాయిదా వేశారు. వేలం హక్కులను దక్కించుకున్న వారు ఏడాది పాటు సంబంధిత వ్యాపారాలు నిర్వహించుకోవచ్చని ఎండోమెంట్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ జనార్ధన్, ఈవో క్రిష్ణయ్య, దేవస్థానం కమిటీ చైర్మన్ నాగిరెడ్డి మల్లికార్జునరెడ్డి, రంగసముద్రం 75వ వార్డు బూత్ కన్వీనర్ సురేష్‌రెడ్డి, కమిటీ సభ్యులు బాబు, బాలిరెడ్డి, బాలశేఖర్, ధనరాజ్, గోపాలమ్మ, ఆదిలక్ష్మి, కొండమ్మ, లక్ష్మీదేవి, ప్రతిభాభారతి తదితరులు పాల్గొన్నారు.

PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174